కథా నిలయం
1555
శ్రీకాకుళం

# సాగరసంగీతం

ఆ ఊళ్ళో అతన్నెరుగనివాళ్ళెవరూ లేరు.

ఆ ఊళ్ళోవాళ్ళనే ఏమిటి?— ఆ ఊరి మీదుగా ప్రయాణం చేసిన ఎంతోమంది రైలు ప్రయాణీకుల్లో కొందరికైనా అతను గుర్తుండి ఉంటాడు. చింపిరి జుట్టు, గుబురు గడ్డం, లోతుకు పీక్కుపోయిన కళ్ళు, మోకాళ్ళపైకి ఎగకట్టిన చింకి ధోవతి, భుజంమీద వో చిన్న ముతకి తుండు— క్లుప్తంగా చెప్పాలంటే యిదీ అతని ఆకారం. ఊచల్లాంటి చేతుల్ని అస్తమానం గాలిలోకి ఊపుతూ, ఎండుటాకుల్లాంటి పెదవుల్ని కదలిస్తూ ఏదో గొణుక్కుంటూ అడుగులో అడుగేసుకుంటూ తిరిగే అతని లక్షణాన్ని గమనించిన వాళ్ళకి తప్పకుండా అనిపిస్తుంది— "అతను 'అదో తరహా' మనిషి" అని.

తొలికోడి కూసిన కొన్ని నిముషాలకి "బండికి గంట కట్టరా పిచ్చీ" అనే పెద్ద మాష్టరు పిలుపే ప్రతిరోజూ

అతనికి మేలుకొలుపు. ఒళ్లు విరుచుకుంటూ లేచి, క్రింద పరచుకు పడుకున్న తుండును దులిపి పైన వేసుకొని వెళ్ళి గంట కొట్టేవాడు. పెద్ద మాష్టరు గదిలోకి పోయి, చేతి లాంతరు తీసుకుని ప్లాట్‌ఫారం చివరదాకా వెళ్ళి, దాన్ని చేత్తో ఎత్తి పట్టుకుని నాలుగైదుసార్లు అటూ యిటూ ఊపేవాడు. ఎర్ర సిగ్నలు పచ్చదిగా మారంగానే వెనక్కు తిరిగి వచ్చేవాడు. లాంతరు గదిలో పెట్టి పంపు దగ్గఱకు పోయి దాని ప్రక్కనే ఉన్న వేపచెట్టు మండ విరిచి పళ్లు తోమటం మొదలెట్టేవాడు. అతని దంతధావనం పూర్తయ్యే సరికి రైలు వచ్చేది. రైలు దిగిన ప్రయాణీకు లెవరైనా ఏ పెట్టో బెడ్డింగో ఊళ్లోకి తీసుకుపోవాలంటే ఆపని చేసే వాడు. లేకుంటే స్టేషనుకు ఎదురుగా ఉన్న అచ్చాయమ్మ హోటలుకు పోయి పప్పు రొట్టిలో పోసుకొని కూర్చునేవాడు. ఆ పని పూర్తయ్యేసరికి మళ్ళీ రైలు వేళయ్యేది. ఇలా ఆ స్టేష నులో పగటిపూట ఆగే ఆరు రైళ్ళలోనుంచీ దిగే ప్యాసిం జర్ల బరువులు మోసిగాని, లేకపోతే హోటల్లో ఆపనీ యీపనీ చేస్తూనో రాత్రిదాకా గడిపేవాడు. కూలి డబ్బుల్తో పొట్ట పోసుకుంటూ ఉండేవాడు. చీకటి పడగానే మాత్రం ఆ ఊరికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న ఏటి ఒడ్డుకు పోయే వాడు. అక్కడ ప్రొద్దుపోయేదాకా కూర్చుని ఎప్పుడో వచ్చి స్టేషన్లో పడుకునేవాడు—'మాయా ప్రపంచమ్ము తమ్ముడూ—' అని ఏవేవో పాడుకుంటూ.

గడచిన పదేళ్ళనుంచీ యిలా సాగిన అతని దినచర్య ఈనాటితో అంతమైంది. అతనీ రోజున లేడు.—

అతన్నెరిగినవాళ్ళంతా "పాపం, పిచ్చోడుపోయాడు" అన్నారు. అంతకంటే ఆప్తు లనబడే అచ్చాయమ్మ, పెద్ద మాష్టరువంటి వాళ్ళు ఏవో మంతనాలు జరిపి ఆ అభాగ్యుని అంతిమయాత్ర కవసరమైన ఏర్పాట్లు చేయటంలో నిమగ్ను లైనారు.

*　　*　　*

గణపతి వ్రాసిన ఉత్తరాన్ని, మళ్ళీ చదువుకున్నాడు చిరంజీవి.

"నేనీఊరు క్షేమంగానే చేరేను. పల్లెటూరు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. కాని ప్రకృతికంటే విభిన్న ప్రకృతులు కలిగినవాళ్ళుగా కనపడుతున్నారు– ఈ ఊళ్లో నాకు తారసపడ్డ మనుష్యులు. నా రాకకోసం ఊళ్ళో పెద్ద మనుష్యు లనబడ్డవాళ్ళంతా వేచి చూస్తున్నారు. నేనీ ఊరుకు వచ్చిన రోజున అంతా ఘనమైన స్వాగతం పలికారు. ఆరోజు హాయిగానే గడిచిపోయింది. మర్నాడు బడిలో ప్రవేశించాను. పిల్లల్లోకూడా ఉత్సాహం గోచరించింది కాని, ఆ ఉత్సాహాన్ని మలినపరుస్తూ "రెక్‌లెస్‌నెస్" అంటారే అది కొట్టొచ్చినట్లు కనపడుతున్నది. బహుశా నా నిర్ణయం తప్పే కావచ్చు కాని కాలం నిర్ణయిస్తుంది గదా తప్పొప్పుల్ని.

"ఇక పోతే యీ ఊళ్ళో నీకు తెలియజేయవలసిన విశేషాలు కొన్ని ఉన్నై. ఊరంతా రాజకీయాల మయం. ఉన్న జనాభా పదివేలయినా పార్టీలు చూస్తే తల కొకటిలా

ఉంది. పల్లెపట్టుల ఔన్నత్యాన్నే విని, చదివి ఊహించుకుని ఉప్పొంగిపోయిన నావంటి వాడికి యీ యథార్థాలన్నీ ఆశాభంగం కలిగించక మానవనుకో. అయినా మనిషిమీద మనిషికి యింతింత పగ ఉందంటే బాధపడకుండా ఉండలేం. మునసబు కరణాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుంది. అలాగే ప్రెసిడెంటు— మోతుబరి మాధవయ్య— వీరింటిమీది కాకి వారింటిమీద వాలదు. చివరికి చాకలి వాళ్ళ దగ్గర్నుంచీ యింతే. ఒక పార్టీవాడు మరో పార్టీకి సంబంధించిన మనుషులకు గుడ్డలు ఉతకడు. ఇలా ఉన్నాయి రాజకీయాలు. నేనీ వూళ్లో అడుగు పెట్టగానే అందరూ బాగానే పలుకరించారు. కాని మాధవయ్యగారు, కరణంగారు కలిసి నన్ను వాళ్ళ దారిపట్టించి, మాధవయ్యగారింట్లో మకాం వేయించటంతో మొదలైంది గొడవ. మర్నాటి నుంచీ నేను యీ 'జట్టు' మనిషినై పోయాను. ప్రెసిడెంటు గారికీ, ఆయన పార్టీ వారికీ, నేనొక శత్రువుగా కనపడుతున్నాను. మాటల్లో చేతల్లో యీ విషయాన్ని వన్నెచిన్నెలుగా వెలువరిస్తూ ఏదో 'తెలివి'గా ప్రవర్తిస్తున్నారు. అర్థం లేని కక్షలకు లోనై ఊరును నాశనం చేస్తున్నారు. ఇవన్నీ చూసి బాధగా ఉండి, ఇలా అని మాధవయ్యగారితో హెచ్చరించి చూశాను. ఆయన నా మాటను తేలిగ్గా తీసుకుని నన్నొక అర్భకుడిలా భావించాడు. నేనా మాట అన్నప్పుడు ఆయన నవ్విన నవ్వునుబట్టి నాకు తెలిసిందిది. నేనీ విషయంలో గట్టిగా జోక్యం కలుగజేసుకోవాలనిపించే లోగానే మరో తాజా పరిణామం సంభవించింది.

"నిన్న సాయంత్రం ఊరి బయటకు షికారుకు పోయి వస్తుంటే మునసబు కనిపించి పలుకరించాడు. మాటల మధ్యలో "మీరా రామాధవయ్యగారిని నమ్ముకుంటే బొందన పడతారు. నామాట విని ప్రెసిడెంటుగారి వైపు మొగ్గమని" ఉచిత సలహా యిచ్చాడు.

"నాకీ మొగ్గటాలు, తగ్గటాలు పనికిరావనీ, నాకు ఆయనంటే అభిమానం గాని, ఈయనంటే కోపంగానీ లేవనీ" విడమర్చి చెప్పాను. "ఊఁ... ఊఁ..." అని తల ఊపుకుంటూ వెళ్లిపోయేడు. వెళ్తూ వెళ్తూ హెచ్చరించి పోయాడు— "జాగ్రత్త పంతులూ, ఊరికి కొత్తోడివి. చీకటిపడి యిలా ఊరెలుపల తిరగమాక" అంటూ. ఇదీ వరస. ఈ ద్వేషాల నన్నిటినీ పోగొట్టి వీళ్ళందర్నీ ఓ త్రాటిమీదకు లాగాలనే కోరిక మాత్రం ఉంది. ఏం చేయగలనో. చూద్దాం... మరి... ఇక ఉంటా...

నీ గణపతి."

చిరంజీవి సన్నగా నవ్వుకున్నాడు. ఏ విషయాన్నయినా 'సీరియస్'గా తీసుకుని ఆలోచిస్తూ కూర్చునే గణపతి రూపం అతని కళ్ళముందు నిలిచింది.

గణపతి స్వరూప స్వభావాలు చిరంజీవికి తెలిసినంతగా మరొకరికి తెలియవు. వాళ్ళిద్దరూ నాలుగేళ్ళపాటు కలిసి బ్రతికినవాళ్లు. ఏమండీతో ప్రారంభమై, ఏమోయ్‌తో మరో మెట్టు పైకెక్కి 'ఏరా' తో పరిపక్వ స్థితిని పొందింది వాళ్ళ స్నేహం.

"గణపతి మంచి ఊళ్ళో పడ్డాడు. సంస్కారానికీ, ఉత్తమాభిరుచులకూ ఈ రోజుల్లో ఉన్న విలువ ఏమిటో ఇకనైనా తెలుసొస్తుందిలే వాడికి." అనుకున్నాడే కాని అంతలోనే "ముక్కుకు సూటిగా పోయే కుర్రాడికి ఏ మన్యాయం జరుగుతుందో" నని తహతహలాడిం దతని మనస్సు.

గణపతి బొత్తిగా లౌక్యం తెలియని మనిషి. ఎంత చిన్న విషయానికైనా ఊగిపోయే తత్వం అతనిది. పైగా ఆవేశం ఓపాలు హెచ్చు. దాంతో ఏ బెడద కొనితెచ్చుకుంటాడో ననిపించింది. 'గణపతికి బెడద' అనే ఊహ కలిగేసరికి మనస్సు మథనపడసాగింది. తమ సాహచర్య మధురోహాలు హృదయంలోనుంచీ పెల్లుబికినై.

కాలేజీ చదువు కోసం పట్నంలో అడుగుపెట్టిన గణపతికి తొలిసారిగా తటస్థపడిన వ్యక్తి తాను. గణపతిరాకతో తన రూము కొక క్రొత్తదనం వచ్చింది. అతని ఆకారంలోనే ఏదో క్రొత్తదనం కనపడుతూ ఉండే దసలు. తలమీద మొదటి సగభాగం అర్ధచంద్రాకృతిలో తీసివేయబడి, రెండో సగాన్ని ఆక్రమించిన అతని గిరజాల జుట్టు, దానికి చివర తోకలా వ్రేలాడే 'పిలక', స్వచ్ఛమైన ఫాలభాగం మీద విభూతిరేఖలూ, నొసట కుంకుమ బొట్టు, రోడ్డు దుమ్మంతా ఊడుస్తూ ఉండే ఖద్దరు పైజమా, దానిమీద అటు పొడుగు చేతులూ, ఇటు పొట్టి చేతులూ కాని ఖద్దరు లాల్చీ—కాలేజీ విద్యార్థుల కాలక్షేపానికి చక్కని ముడి సరుకుగా ఉపయోగపడినై యివన్నీ. ఈ ఆకారానికి తోడు స్వభావంలో కూడా ఒక ప్రత్యేకతని ఆపాదించుకున్నాడు

గణపతి— ఆ రోజుల్లో. తోటి విద్యార్థులు పరోక్షంగాగానీ, ప్రత్యక్షంగాగాని ఏమని గేలి చేసినా ఎదురు మాట్లాడేవాడు కాదు. ఎప్పుడూ ఏదో తన భావనా ప్రపంచంలో తను తేలి పోతున్నట్లు కనిపించేవాడు.

ఫస్టియర్ పూర్తయేసరికి గణపతిలో చెప్పుకోదగిన మార్పు కలిగింది. నలుగురిలో కలిసి తిరగటం, పదిమందితో ఉత్సాహంగా మాట్లాడటం అలవాటు చేసుకున్నాడు. వీటన్నిటినీ మించి పుస్తక పఠనం ఒకటి అబ్బింది. తద్వారా అత నెంతో జ్ఞానాన్ని, సంస్కారాన్ని నేర్చుకున్నాడు. శుద్ధ ఛాందసుని యింట పెరిగి ఊడలు దిగిన సంకుచిత స్వభావా లన్నిటినీ కూకటి వ్రేళ్ళతో ఛేదించివేశాడు. దాంతో అత నిలో అంతర్నిగూఢమై ఉన్న కరుణ, జాలి, సానుభూతి, మంచిదనం వెలుపలిచూపు చూడసాగినై. బాధావ్యథలతో సతమతమైపోయే ప్రజల్ని చూసి అతని హృదయం ఆరాట పడేది. వాళ్ళందర్నీ ఆ విష వలయంలోనుంచి తప్పించా లనీ, ఆ కార్య సాధనకు తన జీవితాన్ని పణమొడ్డాలనీ— ఎన్నెన్నో భావాలు చెలరేగినై. వీటన్నిటినీ తన ఎదుట మహదావేశంతో చెప్తూ పొంగిపోయేవాడు గణపతి. అతన్ని చూసి తనకు గర్వంలాంటి దేదో కలుగుతూండేది. ఆశ్చర్యమూ కలిగేది— ఎలాంటి వ్యక్తి ఎలాంటి మనిషిగా మారేడా అని...

కాలేజీలో రెండవ సంవత్సరమంతా ఎంతో కోలా హాలం చేసేడు గణపతి. ఎప్పుడూ ఏవో సభలూ, ఉపన్యా సాలు, నాటకాలు, ప్రదర్శనలు— ఎందులో చూసినా గణ

పతే. ఏ బీద విద్యార్థి సహాయార్థమో, ఏ బీద కుటుంబీకుని పుత్రిక వివాహ సహాయానికో ప్రదర్శనలు ఏర్పాటుచేస్తూ ఉండేవాడు. ఇలా అనేక వ్యాపకాలతో 'బిజీ'గా తిరిగే గణపతిని చూస్తే గుర్రుగా ఉండేది కొంతమందికి. కొన్నాళ్ళయ్యేసరికి ఆ గుర్రు బయటపడింది. గణపతి చేసే ప్రతి పనిలోను దోషాన్ని చూపటం మొదలెట్టారు కొందరు. అతనిమీద విషప్రచారం ప్రారంభమైంది. గణపతి ఎంతో ఆవేదన పొందేడు. తానేదో నలుగురి మంచికి ప్రయత్నిస్తుంటే వాళ్ళంతా ఎందుకలా అడ్డుపడతారో తెలియక అల్లాడేవాడు. తనతో వాళ్ళందరి సంకుచిత స్వభావాలను గురించి పదేపదే చర్చిస్తూ ఉండేవాడు. అలా గెలుపు— ఓటముల మధ్య గడచిపోయింది ఆ యేడు.

గణపతి ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు. ఇక్కడే అతని జీవితం మలుపు తిరిగింది. సెలవులకు యింటికి వెళ్ళిన గణపతి తనకున్న యావదాస్తి— తన తండ్రి—ని పోగొట్టుకుని అసహాయ స్థితిలో తిరిగి పట్నానికొచ్చేడు. అప్పుడే గణపతి సర్వస్వం తానుగా భావించుకున్నాడు తను. ఆనాడు తనకీ భావన ఎందుకు కలిగింది— ఎలా కలిగిందీ అనేదానికి జవాబు లేదు.

గణపతి చదువు ఆపేయవలసిన పరిస్థితులు ఏర్పడినై. కాని, తన సలహా ప్రకారం అతను ట్రైనింగులో చేరాడు. ఆ రెండేళ్ళూ తనే అతన్ని ఆర్థికంగా కనిపెట్టుకుని ఉన్నాడు. ట్రైనింగు పూర్తిచేయటం, పల్లెటూళ్ళో ఉన్న

మిడిల్ స్కూల్లో ఉద్యోగం రావటం వెంటవెంటనే జరిగినై. వెళ్లిన నాలుగు రోజులకు గణపతి ఉత్తరం వ్రాశాడు.

మిత్రుడికి త్వరలోనే జవాబు వ్రాయా లనుకున్నాడు చిరంజీవి.

* * *

శివకామయ్యగారు గణపతిని దులిపేస్తున్నారు.

"మీరు చేసిన అవివేకపు పనికి ఆ పెద్దమనిషి నన్ను నానా మాటలూ అన్నాడు మేష్టారూ. నేనిలా కరుకుగా మాట్లాడటం మీకు కొంత బాధ కలిగించవచ్చు. కానీ, ఈ స్కూలు హెడ్‌మాష్టరుగా నాకు కొన్ని ప్రత్యేకమైన బాధ్యత లున్నయ్. వాటిని నిర్వర్తించడం నా విధి. అందుకే మిమ్మల్నింత గట్టిగా హెచ్చరిస్తున్నాను. మనలా పొట్టకోసం ఆరాటపడే దురదృష్టవంతు లెవరూ ఈ ఊళ్ళో లేరు. వాళ్ళ పిల్లలకు చదువు రావటమన్నది అంత ముఖ్యం కాదు గాని, వాళ్ళ కేదైనా జరిగిందం టే, ఆ జరిపినవాళ్ళ మీద కక్ష తీర్చుకోవట మన్నది అతి ముఖ్యమైన విషయం. మీ రా కుర్రవాణ్ని సదుద్దేశంతోనే కొట్టి ఉండొచ్చు. కాని, చూశారా. ఆ చిన్న విషయం ఎంత గాలిదుమారం లేవదీసిందో. ఐనా క్లాసులో అంతమంది పిల్లలుండగా వాడే ఎందుకు దొరికాడండీ మీకు. నా ఖర్మ కాలి నా కిలా రాసిపెట్టుంది. ఆఁ. అయిందేదో అయింది గానీ, ఇకనైనా కాస్త జాగ్రత్తగా ఉండండి."

తల వంచుకుని ఆయన చెప్పినదంతా విన్న గణపతి తలెత్తి "అయిందా" అన్నాడు సూటిగా శివకామయ్యగారి కళ్ళల్లోకి చూస్తూ.

శివకామయ్యగారు గతుక్కుమన్నారు. ఆశ్చర్యంగా గణపతిని తేరిపార చూడటం మొదలెట్టారు.

"మీరు చెప్పాల్సిన విషయం అయిందా అని..." గణపతి ఆయన ఆశ్చర్యాన్ని పారద్రోలుతూ అడిగేడు.

శివరామయ్యగారు రెచ్చిపోయారు. "వాట్ డూ యూ మీన్" అన్నారు గట్టిగా.

"ఐ మీన్ టు సే దట్ ఐయామ్ నాట్ ఎట్ ఫాల్ట్." అంటూ విసురుగా అక్కణ్ణుంచీ బయటి కొచ్చేశాడు గణపతి. శివరామయ్యగారి మొహం ఉడికిన బంగాళా దుంపలా మారటం గమనించకపోలేదు గణపతి.

టీచర్స్ రూములో కొచ్చి ఓ మూలగా కూర్చున్నాడు గణపతి. ఒంటరిగా అదే ప్రదేశంలో కూర్చుని కాంపోజిషన్ బుక్సు దిద్దుకుంటున్న తనను హెడ్ మాష్టరు ఉన్నపళాన రమ్మని కబురు పెట్టినప్పుడే అనుకున్నాడు గణపతి. "ఏదో జరిగిందిరా భగవంతుడా" అని. తీరా వెళ్తే జరిగిందిది.

ఆ క్రితంరోజు జరిగిన సంఘటనంతా గణపతి కళ్ళ ముందు తిరిగింది. తాను క్లాసుకు పోయేసరికి క్లాసు రూమంతా నానా హంగామాగా ఉంది. పిల్లలంతా అరుచు

కుంటూ, ఎగురుకుంటూ ఏదో ఘనకార్యం సాధించినట్లు మొగ్గలేస్తున్నారు. తను లోపలికి పోవటంతో వాళ్ళ ఆనందం చప్పున చల్లారింది. ఎక్కడివాళ్ళక్కడ కూర్చోగానే పాఠం మొదలెట్టబోయాడు తను. కానీ అంతలో ఒక పిల్లవాడు వచ్చే నవ్వును జొక్కాలో దాచుకుంటూ 'ఇహిహి' అన్నాడు. విషయమేమిటని గద్దిస్తే బిక్కుబిక్కుమంటూ బోర్డువైపు చూపేడు. వికృతరూపంలో ఒక బొమ్మ వేసి, క్రింద 'ఓ బొజ్జ గణపయ్య' అని వ్రాసేరెవరో దానిమీద. తన కేదో ఆపుకోలేని ఆవేశం, కోపం కలిగాయి. ఫలితంగా ఆ పనికి కారణభూతుడైన కుఱ్ఱాణ్ణి చావ చితక బాదేడు. చూసి కూడా పాఠం చదవలేని మొద్దు వెధవ వాడు. తను కలగన్నాడా ఆ పిల్లాడు ప్రెసిడెంటుగారి ముద్దులకొడుకని!

వాడు పోయి ఇంట్లో ఫిర్యాదు చేయటం, ప్రెసిడెంటుగారు శివకామయ్యగారిని పిలిచి నాలుగు పెట్టటమనేది తర్వాత జరిగిన తతంగం. రాత్రే తనకీ విషయం తెలిసింది. తెలుగుమేష్టరు శంకరశాస్త్రిగారు ఆ సమయంలో ప్రెసిడెంటుగారింట్లోనే వున్నారట — వాళ్ళమ్మాయికి సంస్కృతం నేర్పుతా. ఆయనే తన కిదంతా చెప్పి, ఓ పుల్లవిరుపుమాట అని పోయేడు.

"మన స్కూల్లో టీచర్లందరికీ ఆయనంటే అభిమానమోయ్. ఎందుకంటావా? — ఆయన గంగిగోవు. ఊళ్లో స్కూలు వెలవటానికీ, దాని పోషణకూ అన్నిటికీ ఆయనే

గదా కారణం. పైగా తృణమో పణమో ముట్ట చెప్పే మంచితనం ఆయన కొక్కడికే ఉంది. అందుకని యికనైనా ఆ మాధవయ్య కొంప వదిలేసి ఇవతలికిరా. ప్రెసిడెంటు గారికి ఆగ్రహమొస్తే మనకీ ఊళ్ళో పుట్టగతులుండవోయ్" అని.

ఆయన చేసిన హితబోధలాంటి హెచ్చరికతో తన పట్టుదల ఒకింత పెరిగింది. "వీళ్ళు చేసేదేమిటో చూద్దాం" అనుకున్నాడు ధీమాగా.

గణపతి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ అక్కడి కొచ్చేడు గోపాలం.

గోపాలం స్కూలు జవాను. అతను మాధవయ్య గారి పొలంలో కొంతభాగం కౌలుకు తీసుకుని కొడుకుచేత చేయించుకుంటూ ఉండటంవల్ల, అతనంటే ప్రెసిడెంటుకు పడదు. ఆ విధంగా అతను మాధవయ్యగారి పార్టీ మని షిగా మారినవాడు. ఇప్పుడు గణపతీ అదే కోవలో ఉండటం వలన గోపాలనికి గణపతి అంటే కొంత అభిమానం ఏర్పడింది.

"ఏవిటోయ్" అన్నట్లు సాలోచనగా గోపాలంవైపు చూసేడు గణపతి.

గోపాలం ఏదో చీటీలాంటి కాగితాన్ని అతనికిస్తూ "అమ్మాయిగారు ఇవ్వమన్నారండీ" అన్నాడు.

గణపతి ఆ ఉత్తరాన్ని చదువుకుని "ఊహూం" అని తల పంకించాడు.

*     *     *

మధ్యాహ్నం 12 గంట లైంది.

గణపతి ఇంటి కొచ్చేసరికి మాధవయ్యగారు తాపీగా చుట్ట కాల్చుకుంటూ వరండాలో కూర్చున్నారు. తన గది లోకి వెళ్ళబోయాడు గణపతి.

వెళ్తున్న గణపతిని గంభీరంగా కేకేసేరు మాధవయ్య గారు, "మేష్టారూ ..."

గణపతి అక్కడికొచ్చి నిలబడ్డాడు.

"కూర్చోండి" అన్నారు మాధవయ్యగారు. గణపతి ఆయన ప్రక్కనే ఉన్న కుర్చీని అవతలికి లాక్కుని కూర్చు న్నాడు.

"నిన్న మీరు ఆ కుర్రవాణ్ణి కొట్టినందుకు మీకు శిక్ష పడబోతున్నది తెలుసా?" అన్నారు.

గణపతి నిర్విణ్ణుడైనాడు.

"ప్రెసిడెంటు పరిషత్తుకు పోయి మిమ్మల్ని ఏ శంకర గిరి మాన్యాలకో తోలించటానికి ఈవేళే బయల్దేరు తున్నాడు. ఇదంతా మీరు నా ఇంట్లో ఉండటంవలన జరుగుతున్నది కనుక, నాకు జరుగుతున్నట్లుగానే భావించ టంలో తప్పులేదు. ఏమంటారు"

మాధవయ్యగారి ప్రశ్నను గణపతి మౌనం దాల్చాడు.

"అందుకనే నేనూ బయద్దేరుతున్నాను. వా డొంత ప్రెసిడెంటయినా, నామాత్రపు పలుకుబడి వాడి కెక్క ణ్ణుంచి ఏడుస్తుంది. మిమ్మల్ని ట్రాన్స్ఫరు చేసే మొనగా డెవడో చూస్తా..." ఈ మాటలని తన బుంగ మీసాల నొకసారి దువ్వుకున్నాడు మాధవయ్యగారు.

గణపతికి పరిస్థితి అర్థమైంది. 'సుజాత తనను స్కూలు వదలగానే రమ్మన్నది ఇందుకన్నమాట. ముందుగా తనకు తెలియజేసి మంచిపని చేసింది' అనుకున్నాడు. ఉన్న రాజ కీయాల నన్నింటినీ సమయింపజేసి, ఈ పెద్ద తలకాయల నన్నింటినీ ఒకచోట చేర్చాలనే ఆశతో తానుంటే, దానికి వ్యతిరేకంగా ఒకళ్ళమీద ఒకళ్ళు కారాలూ, మిరియాలూ నూరటం ఎక్కువౌతున్నదేమా అనే బాధ కలిగింది.

"మీ ఉద్దేశ్యమేమిటి?" అన్న మాధవయ్యగారి ప్రశ్నతో ప్రస్తుతంలో పడి, చెప్పాడు గణపతి.

"నాకీ రాజకీయాలంటే గిట్టవండీ. మనుషులమీద మనుషులు ఇంత ద్వేషం పెంచుకుని వినాశనాన్ని కొని తెచ్చుకోవటం వివేకవంతుల లక్షణం కాదు. సమయ మొచ్చింది కాబట్టి నా మనసులో మాట చెప్తున్నాను. ప్రెసిడెంటుగారికీ, మీకూ రాజీచేసి మీ యిద్దర్నీ ఒక టిగా చేయాలని నా కోరిక. దాంతో ఊళ్ళోవాళ్ళంతా ఒకటై గ్రామాభివృద్ధికి పూనుకోవచ్చు. దానికి ప్రయత్నిస్తా నని ఇదివరకే మీతో అన్నానుకూడా."

మాధవయ్యగారు నవ్వేసాగేరు. ఆయ నెందుకు నవ్వుతున్నాడో తెలియకపోలేదు. గణపతికి. "అదేం అంత తేలిగ్గా అయ్యేపనా?" అని ఆయన భావం. కొద్దిసే పయినతర్వాత అన్నారు మాధవయ్యగారు:

"మీరు చాలా అమాయకులండీ మాష్టారూ, ఈ పని మీరు సాధించగలరనే మీ నమ్మకానికీ, సాధించాలనే ఆశకే నాకు నవ్వొస్తున్నది."

గణపతి వెంటనే అనేశాడు. "సాధించటం సాధించలేకపోవటం అనేది ప్రయత్నంమీద ఆధారపడి ఉంటుంది. అసలా ప్రయత్నం లేకుండానే, ఆ పని జరగదని కూర్చుంటే, ప్రపంచంలో జరిగిన మహత్కార్యాలేవీ జరిగి ఉండేవే కావు. అందుకని ప్రెసిడెంటు గారితో మాట్లాడాలని ఉంది నాకు." ఆవేశంతో అతని కంఠం బరువెక్కింది.

కొద్ది క్షణాలు తటపటాయించి "సరే. మిమ్మల్ని నేనెందుకు నిరుత్సాహపరచాలి. వెళ్లి మాట్లాడిరండి. అప్పుడుగాని మీకు ఆ ప్రెసిడెంటు సంగతి తెలీదు." అన్నారు మాధవయ్యగారు. "ప్రెసిడెంటు అనే మాటను నొక్కి పలుకుతూ.

గణపతి సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. చాలామంది పెద్దల్లో సహజంగా గోచరించే లక్షణమే మాధవయ్యగారిలోనూ ఉందనిపించింది. పైకెంత బింకపు మాటలు మాట్లాడినా, ఒక్కొక్క సమయంలో ఎదటివాళ్ళ

చెప్పు చేతలకు యిళ్లే లోనవుతారు కొందరు. ఇదే లక్షణం ప్రెసిడెంటుకూ ఉంటే తన ఆశ నెరవేరకపోదనే ధైర్యం కలిగింది.

గణపతి ప్రెసిడెంటుగా రింటికి బయల్దేరబోతుండగా గది గుమ్మంలో నిలబడి ఉంది సుజాత. గణపతి ఉత్సాహంగా ఆమె ముఖంలోకి చూస్తూ "సుజాతా, నువ్వు చాలా తెలివైన పని చేశావ్. థాంక్స్" అన్నాడు. ఆమె తలవంచుకునే ఉండటంతో గణపతికేదో సందేహం కలిగింది.

"ఏంవిటి సుజాతా? ఏంవిటి సంగతి? ప్రశ్నించాడు.

ఆమె బదులుగా ఒక్కమాటే అంది "మేష్టారూ, నాకేదో భయంగా ఉందండీ. మీరు వెళ్లొద్దు. చూస్తూ, చూస్తూ ఆపదల్ని కొనితెచ్చుకోవట మెందుకు ?"

గణపతి తేలిగ్గా నవ్వేశాడు. "పిచ్చి సుజాతా, నా మీది ప్రేమతో నీ కింత భయంగా ఉంది కానీ, నాకేం ఫర్వాలేదు. అక్కడి కక్కడ నన్నే మాంత్రికుడు బంధించడు. ఒకవేళ అలాంటి దేమైనా జరిగినా ఆదుకోవటానికి నువ్వున్నావుగా" అన్నాడు.

సుజాతకు కోప మొచ్చింది. "మంచేదో, చెడ్డేదో నిర్ణయించుకోలేనంత ఆవేశముంది మీకు. నా కెందుకు. మీ బాధ మీరు పడండి" అంటూ విసురుగా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

సుజాతకు కోపం తెప్పించినందుకు బాధ కలిగింది గణపతికి. అంతలోనే 'సుజాతకు తనమీదున్న భక్తిశ్రద్ధల మూలంగా అంత భయపడుతున్నదిలే' అనిపించింది. సన్నగా ఈల వేసుకుంటూ హుషారుగా బయల్దేరాడు.

*　*　*

గణపతికి ఉత్తరం రాసి పదిహేను రోజులైనా జవాబు లేకపోయేసరికి కాస్త బెంగ పట్టుకుంది చిరంజీవికి. ఆఫీసు నుంచి వచ్చి తన గదిలో పడుకున్న చిరంజీవి ఆలోచనలన్నీ గణపతిమీదనే లగ్నమై పోయినై. గణపతి ఎలా ఉన్నాడో ననే ఆవేదన పెరిగిందతని మనస్సులో.

"సిరంజీవిగోరూ..." అన్న పిలుపుతోపాటు గేటు తలుపు కొడుతున్న శబ్దం, తన నిశ్శబ్దాన్ని భంగపఱచ టంతో లేచివెళ్ళి తలుపు తీసేడు చిరంజీవి.

మధ్య తరగతి రైతులాంటి ఒక వ్యక్తి ఎదురుగా నిలబడి ఉన్నాడు. "సిరంజీవిగోరుండేది ఈడనేనా" అని అడిగాడు.

"అవును, నేనే ఏం కావాలి?" చిరంజీవి ప్రశ్నించాడు.

"మాది...వూరండీ. గణపతి పంతులుగారు పంపారు."

ప్రాణం లేచివచ్చినట్లయింది చిరంజీవికి. "రా... రా..." అంటూ లోపలికి దారి తీశాడు.

గదిలోకొచ్చి కూర్చున్న తరువాత మొదలెట్టాడు.

ఆ వ్యక్తి. "గణపతి పంతులుగారు మా మంచి మనిషండి. నూటికీ, కోటికీ ఒక్కరు తగుల్తారు అట్టాంటి మనుషులు."

"అది సరేనయ్యా. మావాడెలా ఉన్నాడు ? ఏం చెప్పమన్నాడు ?" మధ్యలోనే కల్పించుకుని ఆతృతగా అడిగేడు చిరంజీవి.

"ఉండండయ్యగోరూ... అంత అట్టా గిదవుతారేం. ఆ అయ్యగారికేం. బాగానే ఉన్నార్లెండి" అన్నాడు ఆ వ్యక్తి.

"అమ్మయ్య" అని స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నాడు చిరంజీవి.

అతను మళ్ళీ చెప్పటం మొదలెట్టేడు. "అయ్యగారు మా ఊరొచ్చి నెల రోజులే ఐనా, ఊళ్ళో మా మంచి పలుకుబడి సంపాదించినార్లెండి. మా మాధవయ్యగారికీ, ప్రెసిడెంటుగారికీ రాజీ చెయ్యాలని ఆయనగారి తాపత్రయం. అయితే యేం ఎదవనాకొడుకులు సాగనిచ్చింద్రు గాదు. అంతే బాబూ. అస్తమానం కొట్టుకచచ్చే నాయాళ్ళకు మంచి చెప్తే బుర్ర కెట్టా గెక్కుతుంది. పాపం. బంగారం లాటి మడిసి వూసులు తీసెయ్యటానికి ఎనకా ముందూ చూడకుండా బాదారు."

చిరంజీవి నిర్విణ్ణుడైనాడు. అతని హృదయంలో ఏదో దేవినట్లయింది. "ఆఁ. మా గణపతిని కొట్టేరా?" కంఠం బొంగురుపోయి, ఆవేదనా, దుఃఖం ధ్వనించాయి.

ఆ వ్యక్తి అవునన్నట్లు తలూపుతూ విషణ్ణ వదనంతో వివరాలు చెప్పసాగేడు. "అవును బాబూ. ప్రెసిడెంటుగారినీ,

మాధవయ్యగారినీ ఒక్క తాటిమీదకు లాగాలని పాపం బహు శ్రమపడ్డారు. మాధవయ్యగారికి అదో యిదిలెండి. పంతులుగారేదన్నా గట్టిగా సెప్తే "సరే. కానీ" అనేస్తారు. దీనికీ అట్టాగనే అన్నారు. కాని ఆ కుళ్ళు మనిసి పెసిడెంటు గణపతిబాబుగా రెల్లి మాట్టాడేసరికి, "అట్టాగే. రేతిరికి రచ్చబండకాడ పదిమందీ పోగై, ఉన్న యిసయాలన్నీ తేల్చేచుకుందాం రండన్నాడు. రేతిరి కూడు తిన్నాక ఊళ్లో వాళ్ళంతా ఆడకి చేరినాం. ఆ ళ్ళిద్దరి మద్దెన ఉన్న అనుమానాలన్నీ యివరించుకుంటుంటే, మాటమీద మాట పెరిగి కర్రలు లేచినై. పెసిడెంటు ముఠా అసలా పనికే తయారై ఆడకొచ్చినారని మా కెవ్వరికీ తెలవదు. నలుగు రైదుగురు గర్షణ పడుతుంటే బరిసెలు తీసుకుని దొమ్మీ కొచ్చారు రౌడీ ఎదవలు. దాంతో మావాళ్లూ రెచ్చిపోయారు. రెండు పార్టీలవాళ్లూ 'ఏసెయ్యండహో, అంటే ఏసెయ్యండహో' అని కొట్టుకున్నారు. పంతులుగారేమో "ఆగండి, ఆగండి" అని ఒకటే అరుపులు. గందరగోళంలో ఎవడేశాడో గాని తలకాయకి మా గట్టి దెబ్బ తగిలింది పంతులుగారికి. ఆడిచేతు లిరగ" పళ్ళు పటపటలాడిస్తూ ముగించా డతను.

"గణపతీ" అంటూ చిన్నపిల్లాడిలా భోరున విలపింప సాగేడు చిరంజీవి.

చిరంజీవి వాలకం గమనించిన ఆ వ్యక్తికి బాధ కలిగింది. అనునయిస్తున్న ధోరణిలో అన్నాడు.

"వూరుకోండి బాబు. అయ్యగారికేం ఫర్వాలేదు. మా మాధవయ్యగారు ఆరి పేణానికి పేణం అడ్డమేస్తారు. ఈ గోరం జరిగి మూడ్రోజు లయింది. ఇయ్యాలే పంతులు గారు కళ్ళు తెరిచారు. ఆరు మీకీ యిసయాలన్నీ చెప్పి రమ్మని పంపారు. మాధవయ్యగారు కేసు పెట్లారెండి. ఆళ్ళ అంతు తేలిపోద్ది. పీడరుకాడ కూడా పోయి ఏదో కాయితా లిచ్చి రమ్మన్నారు నన్ను..."

చిరంజీవి ముంజేత్తో కళ్ళను తుడుచుకుంటూ అడిగేడు. "మావాడు నన్ను రమ్మన్నాడా?" అని.

"అవును బాబూ. చెప్పటం మరిచేపోయాను. ఇయ్యాలా రేపు కాకపోయినా, మీ సెలవు యీలునుబట్టి రమ్మన్నారు. నే ఎల్లొస్తా బాబూ. పొద్దు పోతోంది." అంటూ లేచాడతను.

అంగీకార సూచకంగా తల త్రిప్పేడు చిరంజీవి.

ఆ వ్యక్తి వెళ్ళిన తర్వాత గణపతిని గురించిన ఆలోచనలతో సతమత మవసాగేడు చిరంజీవి. ఆఫీసు టైమును చేరువ చేస్తూ ముందుకు సాగిపోతున్న కాలం అతన్ని ఆట్టే సేపు ఆపని చేయనీయ లేదు.

* * *

గణపతి ఆ దెబ్బనుంచీ కోలుకునేసరికి వారం రోజులు పట్టింది. చిరంజీవి వచ్చి చూసి వెళ్ళాడు. ఉన్న విషయాలన్నీ అతనికి వివరించాడు గణపతి. పరిస్థితుల ప్రాతికూల్యానికి చింతిస్తూనే మిత్రుడికి హితబోధ చేసి పోయాడు చిరంజీవి.

"ఆశయాలంటూ నీకీ లేనిపోని గొడవ లెందుకు? నీ పని నువ్వు చూసుకుని తిన్నగా ఉండమ"ని - నవ్వేసి ఊరుకున్నాడు గణపతి.

గణపతి యిప్పుడిప్పుడే లేచి తిరగ కలుగుతున్నాడు. తనకి సంభవించన ప్రమాదంలో నుంచి అతను బ్రతికి బయటపడటానికి కారణభూతులైన వ్యక్తులు ఇద్దరు ఒకరు డాక్టరు వేణు. రెండవవారు సుజాత

సుజాత అతన్ని కంటికి రెప్పలా కాపాడిం దారోజుల్లో. అహరహమూ నిద్రాహారాలు మాని అతని సన్నిధిలోనే కూర్చుని పరిచర్యలు చేసింది. డాక్టరు వేణు తన విజ్ఞానాన్నీ, శక్తినీ వినియోగించి వైద్యం చేశాడు. తను చదువుకున్న విద్యకూ, తన తెలివితేటలకే పరీక్షగా మారిన యీ కేసును 'సక్సెస్' చేసి అతనొక గొప్ప విజయాన్ని సాధించాడు. ఎల్లప్పుడూ పెదవులపై చిరునవ్వుల వెన్నెలలు కురిపిస్తూ, రోగుల్ని మురిపించే వేణు స్వరూపం, శాంతీ విశ్రాంతులు లేకుండా కన్నుల్లో వత్తులు వేసుకుని, అతని క్షేమం కోరి పరిచర్యలు చేసినా అలసట మెరుగని సుజాత స్వభావం— ఈ రెండే గణపతిని మామూలు మనిషిని చేసినై.

ఈ వారం రోజుల్లోనూ ఊళ్ళో మరికొన్ని ముఖ్యమైన సంఘటనలు జరిగినై. గోపాలం కౌలుకు చేసే మాధవయ్యగారి పొలంలో కోసి ఉంచిన మినుమును సగానికి సగం దొంగిలించుకు పోయారు. డాక్టరు వేణు సొంత డిస్పెన్సరీలో ఒక భాగాన్ని తగలబెట్టేశారు, మందులన్నీ అగ్నికి ఆహుతై పోయినై. మొదటిదాని వలన ఐదారు వందల

రూపాయలు గోపాలానికి నష్టమైతే, రెండవదాని వలన సుమారు వెయ్యి రూపాయల వరకూ నష్టపోయాడు వేణు. వేణు తనకు వైద్యం చేసి ప్రెసిడెంటు పార్టీ వాళ్ళకు శత్రు వైనాడు. ఇలాగని అనుకున్న గణపతికి అసలు సంగతి తెలిసే సరికి పట్టరాని ఆవేశం కలిగింది.

సుజాత ఆతనికా విషయం చెప్పగానే నమ్మలేక పోయేడు. వేణును లోపాయకారీ వ్యవహారానికి దిగమని ప్రోద్బలం చేసి, తనను అంతం చేయమని వత్తిడి చేశారట ప్రెసిడెంటూ వాళ్ళు. అతని కష్టానికి ప్రతిఫలంగా వెయ్యి రూపాయలు ఎర చూపారట. మనుషుల ప్రాణాలు తీసే డాక్టరా వేణు? కాదు కాబట్టే గణపతి పునర్జన్మ ఎత్తి ఈ రోజున ఊరిబయట షికార్లు చేస్తూ తనలో తను ఆలోచించు కుంటున్నాడు.

'హుఁ... తన ప్రాణం తీయటానికి వెయ్యి రూపాయల ఖర్చుకు వెనకాడలేదే. వాళ్ళకు తనేం ద్రోహం చేశాడు. తన ప్రాణాల్ని తీస్తే వాళ్ళకి ఒరిగేదేమిటి? ఆ వెయ్యి రూపాయలూ ఏ గ్రామాభివృద్ధి కార్యానికో ఉపయోగించ గలిగితే, వాళ్ళకీ వాళ్ళ తర్వాతి తరం వాళ్ళకీ ఎంత ఉపయోగంగా ఉండేది? అలా కాకుండా అల్లకల్లోలంగా ఉన్న ఊరును ఓ దారికి తెద్దామనే తన మంచి ప్రయత్నానికి ప్రతిఫలంగా తన ప్రాణాన్నే బలిపెట్ట మన్నారు. ఏం మనుషులో' అనిపించింది గణపతికి.

కంకర్రాయిని తన్నుకుంటూ నడుస్తున్న గణపతి

మనస్సు వేణు, సుజాతల మంచితనాన్ని తలచుకుని ఆర్ద్రమైంది.

ప్రెసిడెంటు పార్టీవాళ్ళు వేణూకు డబ్బు ఆశ చూపటం, అతను నిరాకరించిన విషయం, యివేమీ ఊళ్ళో ఎవ్వరికీ తెలియవు. చివరికి మాధవయ్యగారికి కూడా తెలీదు. అందరూ అనుకోవటం, తనకు వైద్యం చేస్తున్నందుకే అతని కిలా జరిగిందని. కాని అసలు విషయం సుజాత కొక్కదానికే చెప్పేడట వేణు.

పరధ్యానంగా యింటికి చేరిన గణపతి మాధవయ్యగారి యింటి వసారాలోని దృశ్యాన్ని చూచి ఆశ్చర్యపోయాడు.

మాధవయ్యగారు మరో నలుగు రైదుగురు వ్యక్తులు కూర్చుని ఏదో ముచ్చటించుకుంటున్నారు.

గణపతి తలవంచుకుని తన గదిలోకి పోబోయేడు—కాని, మాధవయ్యగారు పిలిచారు "మాష్టారూ."

గణపతి ఆయనవైపు ప్రశ్నార్థకంగా చూసేడు.

కూర్చోండని కుర్చీవైపు చేయి చూపుతూ చెప్పారు మాధవయ్యగారు. "వీరిది...పూరండి. వీరు పున్నయ్యగారు. ఇతను వాళ్ళబ్బాయి భుజంగం. మన సుజాతను చూడటానికని వచ్చారు."

ఆశించని ఈ సంఘటనకు గణపతి నివ్వెరపోయేడు. మాటవరసకైనా ఏనాడూ సుజాత పెళ్ళిని గురించి మాట్లాడి ఎరుగని మాధవయ్యగారు యింత త్వరగా పెళ్ళి ప్రయత్నాలు చేయటానికి గల కారణాన్ని వెదకసాగింది గణపతి మనస్సు.

"ఇత నెవరండీ?" భుజంగం ప్రశ్న కరుకుగా విని పించింది.

గణపతి అదోలా అతనివైపు చూశాడు. భుజంగం మాధవయ్యగారి జవాబుకు నిరీక్షిస్తున్నాడు.

"మా స్కూల్లో మేష్టారుగారండి. మా యింట్లోనే ఉంటున్నారు.

మాధవయ్యగారి జవాబుకు 'ఓహో' అన్నారు. భుజంగం వాళ్లూ.

గణపతి లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు. భుజంగం ఆకార వికారాలను గురించి మననం చేసుకో సాగిందాతని మనస్సు.

ప్రాణికోటికి జోల పాడుతున్నది నిశాకాంత.

కోరిన కోర్కెలు తీరనివాళ్ళంతా కోపంతో నసుక్కుంటూ, తమ తమ కోర్కెల్ని తీర్చుకునేందుకు వ్యూహాల్ని పన్నుతున్నారు.

గణపతి గదిలో పడుకుని తానా ఊరు వచ్చినప్పట్నుంచీ జరిగిన విషయాలను చర్విత చర్వణం చేస్తున్నాడు.

నిశ్శబ్ద నిశీథిలో కాలి యడుగుల చప్పుడు, దాని ననుసరించి గది తలుపును నెమ్మదిగా తట్టిన శబ్దం, అతని ఆలోచనలకు అంతరాయం కలిగించినై. లేచి వెళ్ళి తలుపు తీశాడు.

గణపతి విస్తుపోయాడు!—

ఎదురుగా సుజాత!

అర్థరాత్రి... ఏకాంతంగా తన గదిలోకి సుజాత రాక గణపతిని నిస్సబ్దుణ్ణి చేసింది. శరీరం కంపించినట్లయి, అంతలోనే తెలివి తెచ్చుకుని లైట్ వేశాడు.

సుజాత రాకనూ నివ్వెరపోతున్న గణపతిని ఆమె ఆకారం భయవిహ్వాలుడ్ని చేసింది.

సుజాత చెక్కిళ్ళపై కన్నీరు చారలు కట్టి, కళ్లు ఎర్రబడి వాచిపోయినై.

"సుజాతా!" గణపతి కంఠం వెలుగు రాచుకుంది.

"........."

"లోపలికి రా సుజీ."

సుజాత తలెత్తి గణపతి వైపు చూసింది. గణపతి తాను తీసుకున్న చనువుకు సిగ్గుపడి తల దించుకున్నాడు. ఆమె ఉలుకూ, పలుకూ లేక అలాగే నిలబడిపోయింది.

గణపతికి ఏం చేయాలో పాలుపోలేదు. వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు — రెండు చేతుల్తో నుదుటిని పట్టుకుని. వారిద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో కొద్దిక్షణాలు గడచినై. సుజాత ఏడుపు వెక్కిళ్ళ స్థాయికి చేరింది. గణపతి బాధపడ్డాడు.

"ఏం జరిగింది సుజాతా. చెప్పు."

సుజాత వెక్కిళ్ళు దిగమ్రింగుకుంటూ అన్నది. "ఏం చెప్పేది, ఎలా చెప్పేది మేస్టారూ? ... నా పెళ్ళి ... నా కిష్టంలేదు..."

గణపతి కళ్లు పెద్దవిచేసి సుజాతను చూసేడు.

ఆమె కొంగుతో కళ్లొత్తుకుంటూ అన్నది: "నాన్నకు ఎన్నోవిధాల చెప్పాను... కాని, ఆయన వినటంలేదు."

"ఎందుకని యిష్టంలేదు ?" తన ప్రశ్నకు సుజాత చెప్పబోయే సమాధానం యిదై ఉంటుందనిపించింది గణపతికి. ఆమె జవాబు చెప్పేలోగా అలాంటి 'ఇది' లు పది గణపతి మనస్సులో ఒకదాని వెంట ఒకటి మెదలి కదలి పోయినై.

అతని ఊహల నన్నింటినీ పటాపంచలు చేస్తూ ఎదురు ప్రశ్న వేసింది సుజాత — "మీకు తెలీదా మాష్టారూ ?"

"ఏఁవిటి ?"

"అదే...ఆయన్ని గురించిన రకరకాల వార్తలు. నేను వారిని చూడకముందే గోపాలం ఆయనగారు లీలా విలాసాల నన్నిటనీ వర్ణించాడు. పైగా ఆ రూపాన్ని చూస్తే...అబ్బ..." అని రెండు చేతుల్లో మొహాన్ని దాచుకుని విలపింపసాగింది సుజాత.

గణపతి కళ్ళ ఎదుట భుజంగం ఆకారం గోచరించింది.

బట్టతల వచ్చే సూచనల్ని కనుపింపజేస్తూ తలపై రెండు వైపులా కోసుకుపోయి మధ్యలో మాత్రం కోడి యీకల్లా నాలుగైదు వెంట్రుకలు కలిగిన తల, కనుపాపలు బయటికి చొచ్చుకొచ్చి ఉబికిన కళ్లు, ఎడం చెంపమీద

గాటు, చివరలు మెలిపెట్టి పైకి నిలబెట్టిన మీసాలు, పీటన్ని టికీ తగినట్లున్న కాటుకరంగు మందపు చర్మం —

గణపతి తల ప్రక్కకు వంచి సుజాతను చూశాడు.

చిరుగాలికి ఊగిసలాడే అలినీల కుంతలాలు, కోల మొహం, గండుమీనుల్లాంటి కళ్ళు, కమలాపండు తొన ల్లాంటి పెదవులు, బంగరు వన్నె శరీరంతో సౌకుమార్యాన్ని పుణికి పుచ్చుకున్న కుందనపు బొమ్మ—

"కాకి ముక్కుకు దొండపండు" — అనిపించింది. పైగా భుజంగం లీలా కృష్ణుల అవతారమని చెప్పేడట గోపాలం.

గణపతి మనస్సు కలత చెందింది. ఊహాలోకాన్నుంచీ యిహలోకంలో పడి అడిగాడు.

"అయితే మీ నాన్నగారు అంతగా పట్టు పట్టటానికి కారణమేమిటి ?"

"ఏదో ఉందట నాకు మాత్రం చెప్పటంలేదు. కాని- నువ్వీ పెళ్ళి చేసుకోక తప్పదని బలవంతం చేస్తున్నాడు."

గణపతి చప్పున ఏదో స్ఫురించినవాడిలా కుర్చీలోంచి లేచి సుజాత దగ్గరగా వచ్చాడు. ఆమెను పరికించి చూస్తూ "ఒక్క విషయం అడుగుతాను, నిజం చెప్తా... ?" అన్నాడు.

సుజాత తలవంచుకునే అన్నది. "అడగండి మాస్టారూ !"

గణపతి క్షణంసేపు తటపటాయించి అడిగాడు. "భుజంగమంటే నీకు సదభిప్రాయం లేకపోవటం సరేగాని నువ్వు... నువ్వు..." అని అర్థోక్తిలో ఆపాడు.

: ధ :

సుజాత తలెత్తి అతనివైపు ఏంవి టన్నట్లు చూసింది.

గణపతి తడపడుతూ "నువ్వు మరెవర్నయినా ప్రేమిం చావా, సుజాతా ?" అన్నాడు సన్నగా.

సుజాత గణపతి కళ్ళల్లోకి సూటిగా చూసి, వెంటనే సిగ్గుపడుతున్నట్లు తల విలాసంగా వంచుకుంది.

గణపతిలో హృదయచలనం అధికం కాసాగింది. ఆమె నోటివెంట రాబోయే పలుకు కోసం ఆతృతగా నిరీ క్షించ సాగిం దాతని మనస్సు.

సుజాత మాటలు కూడబలుక్కుని "డాక్టరుగారు" అంది.

గణపతి నిర్ఘాంతపోయాడు. కొద్ది క్షణాలు అతని హృదయంలో భావ సంఘర్షణ రేగింది.

ఇంతలో సుజాత వేదనాపూరిత కంఠంతో అంది. "అన్నీ, తెలుసుకుని, నా క్షేమాన్ని కోరే మీరే యిక నాకు శరణ్యం మాష్టారూ. మా నాన్నతో మాట్లాడి ఆయనచేత యీ ప్రయత్నాన్ని విరమింపజేసే బాధ్యత మీదే. ఏం మాష్టారూ ?"

సుజాత ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాడు గణపతి.

మళ్ళీ ఆమే అంది. "మీకే నాలాంటి చెల్లెలుంటే యిలా జరగనిస్తారా మాష్టారూ..." ఆమె కంఠం గాద్గదిక మైంది. పైట కొంగుతో కళ్లు వత్తుకోసాగింది.

గణపతి ఆశ్చర్యంతో తలెత్తి చూసేడు. కాని ... సుజాత అప్పటికే గుమ్మందాటి వెళ్ళిపోయింది,

ఈ సంఘటన కలవరపఱచిం దతన్ని. వెనుదిరిగి భారంగా మంచంమీదకు చేరాడు. గణపతి.

తన కర్తవ్య మేమిటో బోధపడలే దాతనికి, మాధవయ్యగారికి చెప్పి వొప్పించినా, పల్లెపట్టుల్లో పుట్టి పెరిగి పెద్దగా విద్యాగంధంలేని సుజాతను డాక్టరు వేణు భార్యగా స్వీకరిస్తాడా? అనే సందేహం అతన్ని పీడించసాగింది. ఆమె స్థితికి హృదయంలో కలిగిన బాధ; ఏమైనా సరే, సుజాతను ఇష్టంలేని పెండ్లికి బలి కానీయకూడదనే నిశ్చయాన్ని కలిగించిం దాతనిలో.

ఆలోచనల్తో ఎప్పుడు నిద్రపట్టిందో తెలియని గణపతికి వరండాలో మాధవయ్యగారి అరుపులకు మెలకువ వచ్చింది. లేవటానికి ప్రయత్నించాడు కాని ఒడలంతా బడలికంగా ఉండి కళ్లు తెరిపిడి పడలేదు.

"సిగ్గులేని వెధవలు. వంకర కూతలు కూశారంటే చెప్పు తీసుకు ఒళ్ళు చీరేస్తాను. జాగ్రత్త."

కేకలు కాస్త ఉధృతంగానే ఉండడంతో కళ్ళు నులుముకుంటూ లేచాడు గణపతి. పైన కండువా వేసుకుని గది తలుపు తీసి వసారాలోకి వచ్చాడు.

మాధవయ్యగారు అటూ యిటూ పచార్లు చేస్తున్నారు. గోపాలంతో ప్రక్కగా నిలబడి ఉన్నాడు.

గణపతే పలకరించాడు. "ఎప్పుడొచ్చారండి"

"ఇప్పుడే మాష్టారూ... చూశారా ఏం జరిగిందో."

మాధవయ్యగారి ప్రశ్నకు ఆయనవేపు ప్రశ్నార్థకంగా చూడటంకన్న మరేమీ చేయలేకపోయాడు గణపతి.

"సుజాతకు పున్నయ్యగారి సంబంధం చేయటం నేను 'ఎమ్. ఎల్. ఏ'ని కావటం కోసమని ఊళ్ళో పెద్ద ప్రచారం మొదలెట్టాడు ఆ ప్రెసిడెంటుగాడు. నిన్న వాళ్ళు వచ్చి వెళ్ళి నప్పట్నుంచీ యీ పొగ రాజుకుందిట. రాత్రి నేనూ వాళ్ళతో వెళ్లానా!— యీపూట వచ్చేసరికి యిదీ వార్త" మాధవయ్యగారు కుర్చీలో కూర్చున్నారు.

గణపతికి ఆయనతో సుజాత విషయం ప్రస్తావించ టానికి యిదే మంచి సమయ మనిపించింది. కాని, 'ప్రొద్దున్నే మొహమన్నా కడుక్కోకుండా యీ గొడవెందుకు.' అనే సందేహం లోపల పీడించింది.

ఇంతలో మాధవయ్యగారే మళ్ళీ మొదలెట్టారు. "అది కాదు మేష్టరుగారూ. నా పిల్ల బాగోగులు నాకు తెలీవూ? కేవలం నా స్వార్థం కోసం అమ్మాయిని ఉపయో గించుకునేంతటి నీచుడినా నేను?"

గణపతి సాలోచనగా ఆయనవైపు చూసి అడిగాడు. "సుజాతకు అతనంటే సదభిప్రాయం లేనప్పుడు ఆమెను వత్తిడి చేయటం బాగుండదేమో?..."

"అదుగో అదేనండి. ఈ సంగతి ఊళ్ళో వాళ్ళకి ఎలా తెలుసు అంటా. ఇంతవరకు తెలీదు గదా? అయినా వాళ్ళు ఆ భుజంగాన్ని చూసి అమ్మాయికి తగినవాడు కాదనీ, ఆ కారణంచేత నా స్వలాభం కోసం యీ పెళ్ళికి నేను ప్రయత్నిస్తున్నాననీ వాళ్ళ ఊహ."

"ఊళ్ళోవాళ్ళ సంగతి మన కెందుకు గానీ, అసలు నే ననేది సుజాత విషయం..."

మాధవయ్యగారు కొద్ది క్షణాలు ఆగి అన్నారు. "చూడండి. చిన్నతనం కనక ఏదో అలా అంటున్నది గానీ, అభం శుభం తెలియని పిల్ల దానికేం తెలుసు మాష్టారూ."

"ఒకవేళ సుజాత యీ పెళ్ళిని దృఢంగానే వ్యతిరేకిస్తే..."

"అంత మొండి పట్టుదల పట్టటానికి కారణం?"

గణపతి తడబడ్డాడు. సరే. జరిగిందేదో జరుగుతుంది. ఉన్న సంగతి చెప్దామనిపించింది. "సుజాత మరో వ్యక్తికి మనసిచ్చిందండీ..."

"ఆఁ..." మాధవయ్యగారు అదిరిపడ్డారు, గణపతివైపు అనుమానాస్పదంగా చూశారు. "ఎవరతను?" ఆయన కంఠస్వరం మంద్రంగా ఉంది.

"డాక్టర్ వేణు." గణపతి సమాధానం చెప్పి తలెత్తి మాధవయ్యగారి కళ్ళల్లోకి చూసేడు.

ఆయన ఏదో ఆలోచిస్తూ గంభీరంగా ఉండిపోయారు. కొన్ని నిముషాల తర్వాత అన్నారు. "వీల్లేదు మాష్టారూ. అలా జరగటానికి వీల్లేదు. పున్నయ్యగారితో నాకున్న మైత్రిని, పలుకుబడిని చెడగొట్టుకోలేను. ఈ పెళ్ళి జరిగి తీరాల్సిందే. వచ్చిన వాదు రానే వచ్చింది—యింకేఁవిటి?"

గణపతి బాధపడ్డాడు. మాధవయ్యగారి పట్టుదలకు పర్యవసానాన్ని ఊహించుకుని, సుజాతను తలుచుకుని అతని హృదయం వ్యథ చెందింది. సన్నగా అన్నాడు. "ఊళ్ళో వాళ్ళతో పట్టుదలకు పోయి బిడ్డ బ్రతుకు బండలు చేసుకుంటారా మాధవయ్యగారూ ... ఆలోచించండి... సుజా

తను తల్లీ తండ్రీ మీరై పెంచి పెద్ద చేశారు. ఇప్పుడా మనుకారాన్ని చంపుకుని ఆమె కిష్టంలేని పెళ్ళి చేసి, ఆమె జీవితాన్ని నరకంగా మారుస్తారా?..."

గణపతి ఆవేశంలో యింకా ఏదో చెప్పబోతున్నాడు కాని, మాధవయ్యగారు మధ్యలోనే "మాష్టారూ?..." అని గట్టిగా అరిచారు.

"మీరు నన్నిలా హింసించవద్దు. నా బిడ్డ క్షేమాన్ని నాకంటే మిన్నగా కోరేవాళ్ళా మీరంతా? సుజాత పెళ్ళి భుజంగంతో జరగక తప్పదు..." అని విసురుగా పై పంచె దులుపుకుంటూ లోపలికి వెళ్ళిపోయారు — మాధవయ్య గారు.

దీర్ఘంగా నిట్టూర్చి లేచాడు గణపతి.

గదిలోకిపోబోతున్న గణపతినిఆపి చెప్పాడు గోపాలం. "ఊళ్ళోవాళ్ళనుకునే దాంట్లో నిజముంది బాబూ. ఈ అయ్యకి ఆ పదవిమీద యామోహం పుట్టింది. లేకుంటే ఆ భుజంగం చేష్టలు యీయనకి మాత్రం తెలవ్వా. ఏందో పాపం. ఆ పిల్ల ఖర్మ."

గోపాలం చేతి కర్ర చప్పుడు చేసుకుంటూ సాగి పోయాడు.

గణపతీ—అతని ఆలోచనా మిగిలారు.

* * * *

రోజులు కాలగర్భంలో దాక్కుంటున్నాయి.

రోజు రోజుకూ మాధవయ్యగారింట్లో పెళ్ళి సందడి హెచ్చుతున్నది.

రోజు రోజుకూ ఊళ్లో పగల పొగలు రాజు కుంటున్నాయి.

గణపతి పని నానాటికీ తీసికట్టు అన్న ధోరణిలో పడింది.

అతడ్ని కొట్టినందుకు జరుగుతున్న కేసులో నాలుగు వాయిదాలు గడిచినై. సాక్ష్యాధారాలు తమవైపు బలంగా లేక పోవటంతో ప్రెసిడెంటు పార్టీవాళ్ళు కాస్త త్రోక్కిసలాటలో పడ్డారు. కోర్టుకు వచ్చీ పోయే సమయాల్లో గణపతి చిరంజీవిని కలుసుకుని అతనికి ఉన్న విషయాలన్నీ వివరిస్తూనే ఉన్నాడు. కేసులో రేపు చివరి వాయిదా. విచారణ ముగుస్తుంది.

నేరం తమదని తేలిపోతున్నదనే ఉక్రోషంతో ప్రెసిడెంటూ వాళ్లూ తామంటే పళ్ళు నూరటం హెచ్చింది.

“మా కేదన్నా జరిగితే ప్రాణాలతో ఎవడూ ఉండడు” అని తనకు వినపడేటట్లు మొన్న మునసబు కాబోలు పెద్దగా అంటున్నాడు.

ఇది ఇలా ఉండగా—

సుజాతంటే తనకు గల ప్రేమాభిమానాల వలన ఆమెను భుజంగం బారినుంచి తప్పించాలని తన శాయ శక్తులా ప్రయత్నించాడు గణపతి. ఆ ప్రయత్నంలో మాధవయ్యగారికి తనంటే ఉన్న గౌరవ మర్యాదల్ని కోల్పోయాడతను. కనుకనే ఆయన చేత అంతమాట అనిపించుకున్నాడు.

"ఏకు మేకయిందన్న సామెతగా నన్నే విమర్శిస్తున్నావ్ పంతులూ. ఎంత అలుసిచ్చినా నెత్తి కెక్కితే సహించలేను నేను. ఇది మా సొంత విషయం. ఇందులో నువ్వు తల దూర్చటం మంచిదికాద"న్న మాధవయ్యగారి మాట తల కొట్టేసినట్లయింది గణపతికి.

"అవును. వాళ్ళ స్వవిషయాల్లో అంత లోతుకు పోవటం తప్పే" అనుకున్నాడు.

వేణూ కూడా యిదే విషయాన్ని యింకొంచెం సుతిమెత్తగా చెప్పాడు. "నేను సుజాతను ప్రేమించిన మాట నిజమే మాష్టారూ. కాని, అందని మ్రానిపండుకు అర్రులు చాచడం అవివేకమన్నారు గదా. అందుకని మాధవయ్యగారు స్వయంగా వచ్చి ఆ విషయాన్ని అడిగితే ఉన్నమాట చెప్పాను. 'మీ అమ్మాయిని చేసుకోలేనంత మాత్రాన నేనేమీ భగ్నప్రేమికుడ్ని కాబోననీ, అలాంటి బాధలూ, త్యాగాలూ నాకు తెలియవనీ' చెప్పాను. నిజం మేష్టారూ. ఈ రోజుల్లో అతిమంచి మెడకు వుచ్చు తగిలిస్తుంది."

కాని, చూస్తూ చూస్తూ ఒక నిండు ప్రాణానికి అన్యాయం జరుగుతూ ఉంటే చేతులు ముడుచుకు కూర్చోవటం అనార్య లక్షణమని గణపతి అభిప్రాయం.

అయితే ఏం. అతని అభిప్రాయాలు హేళనపాలై, అతని ఆదర్శాలు బెడిసికొట్టి, అతని ఆశయాలు గగన కుసుమాలుగా మారుతుంటే అతనేమీ చేయలేని అసహాయుడైనాడు.

ఈ నిస్సహాయ స్థితి అనేది రానే రాకూడదు. కానీ, వచ్చిందంటే మనిషిని శల్యపరీక్ష చేసి క్రుంగదీస్తుంది. ఈ స్థితిలోనే సంఘానికి లోకువై పోతాడావ్యక్తి. గణపతి స్థితీ అలాగే ఉంది.

గదిలో కూర్చున్న గణపతికి క్రితంరోజు అదే సమయంలో జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది.

షికారుకని తమ ఊరి వెలుపల కాలవ గట్టుకు పోయి తిరిగి వస్తున్నాడు.

ముసిరిన మసక చీకట్లలో దారి సరిగా కనబడటం లేదు. తాటితోపు దగ్గరి కొచ్చేసరికి, మట్టి రోడ్డుమీద ఏర్పడిన బండిగాడిలో కాలుపడి మడమ గీచుకుపోయింది. కాలు మెలి తిరిగినట్లయి అడుగులు తడబడి తూలిపడ్డాడు తను. ఆ పడ టంలో దారి పక్కన నిలబడ్డ ఒక యువతికి కొట్టుకున్నాడని తెలియటానికి ఎంతోసేపు పట్టలేదు తనకు.

ఈ హఠాత్సంఘటనకు తత్తరపడి అంతలోనే తమా యించుకొని పరీక్షగా ఆవైపు చూసేడు తాను. కాని అప్ప టికే ఆ యువతి 'అమ్మో' అని అరుచుకుంటూ కంగారుగా ఊరివైపు పరుగెత్తుతోంది

తన పొరపాటుకు ఎంతగానో చింతించాడు తాను. ఆమె ఎవరై ఉంటుందని ఊహించుకుంటూ యింటికి చేరు కున్నాడు.

మాధవయ్యగారి యింటి గేటుముందు దృశ్యాల్ని చూసి ఆశ్చర్యపోయాడు తను.

శివకామయ్యగారు; ప్రెసిడెంటుగారు, మఱికొందరు

మోతుబరులు, ఇంకా కొందరు వాళ్ళ అనుయాయులు గుంపుగా నిలబడి ఏదో అరుస్తున్నారు. తాను రావటంచూసి "అడుగో వస్తున్నాడు... వస్తున్నాడు..." అంటూ అర వటం ప్రారంభించారు.

తాను వాళ్ళ దగ్గరికి రావటం, ప్రెసిడెంటు దారి కడ్డంగా నిలబడి తనను నిలవేయటం జరిగింది.

శివకామయ్యగారు కోపంతో నిప్పులు కక్కుతూ, "ఎవరనుకున్నావో ఏమో... నిప్పులాంటి మనుషులం మేము. నీలాగా అల్లరి చిల్లరి జాతి అనుకున్నావేమో జాగ్రత్త. ఊరి బయట ఒంటరిగా పిల్ల కనపడితే రభస చేస్తావా?" అని ఏవి శేమిటో అంటున్నారు.

"ఒళ్ళు తిమ్మిరెక్కిందేమో కుర్రాడికి వదిలించండిరా. ఒకసారి శాస్తి జరిగినా బుద్ధి రాలేదల్లే ఉంది. చావ బాదండి. ఎవ డడ్డమొస్తాడో నే చూస్తా..." అన్నాడు ప్రెసిడెంటుగారు తన బుంగమీసాల్ని దువ్వుకుంటూ, మునసబువైపు చూస్తూ.

జరిగిన సంగతిని తా నెంతగా చెప్పినా వినుపించు కోక వెనకనున్న నలుగు రైదుగురు వ్యక్తులు కర్రలు ఎత్తటం కూడా జరిగింది. కాని శివకామయ్యగారే వాళ్ళని వారిస్తూ అన్నారు.

"నాలో యింకా పాపభీతి ఉండబట్టి బ్రతికిపోతున్నావ్. జాగ్రత్త. మళ్ళీ నా పిల్లవంక కన్నెత్తి చూచావో ప్రాణాలు దక్కవు..." అని పళ్ళు నూరుతూ వెనక్కి తిరిగాడు. ఆయన్ని అనుసరించి వెళ్ళిపోయారు మిగతావాళ్ళు.

సిగ్గు, కోపం, బాధలతో కుంచించుకుపోయి గది లోకి వెళ్ళబోతున్న తనకు మాధవయ్యగారిమాట వినపడక పోలేదు. "కానిపనులకు పోతే అయినవాళ్ళయినా యీస డించుకోక మానరు."—

మాధవయ్యగారి మాట గుర్తుకొచ్చి దుఃఖం ముంచు కొచ్చింది గణపతికి.

జరిగిన సంఘటనను పునశ్చరణ చేసుకుంటున్న గణ పతి ఏకాంతాన్ని భంగం చేసినై, వరండాలో చేరిన అమ్మ లక్కల పెళ్ళి ఉపన్యాసాలు. కుర్చీలోనుంచీ లేచి గదిలో పచార్లు చేయ నారంభించాడు.

ఇంతలో ఎవరో కుఱ్ఱా డొకతను ఏదో కాగితం తెచ్చి "మాష్టారూ ... మీకో ఉత్తరమండీ..." అంటూ అతని చేతికిచ్చి మెరపులా మాయమయ్యాడు.

గణపతి కాగితం మడత విప్పి చదువుకున్నాడు.

చదివి చలించిపోయాడు...

"పంతులూ... !

ప్రాణాలమీద ఆశ ఉంటే యీ రాత్రికి రాత్రే వూరొదులు. ఈమాట కాదన్నావో సూర్యోదయాన్ని చూడలేవు... రేపు విచారణ చివరిరోజు ... నీ యిష్టం ...

ఇట్లు, నీ శ్రేయోభిలాషి...

గణపతికి పరిస్థితి విషమించిందని తెలిసింది. రేపు కొట్లాట కేసులో విచారణకు చివరి రోజు. కేసులో నేరస్థు లనబడే పెద్ద తలలకు ఏదో శిక్ష పడటం ఖాయమనేది

అందరికీ తెలిసినవిషయం. తత్కారణాన తనను బెదిరిస్తున్నా రన్నమాట. అంటే వాళ్ళ ఉద్దేశ్యం తానీవూరు వదిలిపెట్టి పోయి, కేసును ఉపసంహరించుకోవాలని.

గణపతి మనస్సు పరిపరి విధాలుగా పోతున్నది. కర్తవ్యాన్ని బోధ చేస్తారేమోనని మాధవయ్యగారిని పిలిచి ఉత్తరం చూపించాడు.

ఆయన దాన్ని చదివి, అంటీ ముట్టనట్టు "ఏదో చెయ్యండి మేష్టారూ... అసలే పనుల బరువుతో నా తల తిరుగుతున్నది. ఇలాంటివన్నీ ఎక్కడ నెత్తిమీద పెట్టుకోను. ఇప్పటికే సగం రొంపిలో దిగబడ్డాను..." అని విసుగ్గా అని, విసురుగా, హడావుడిగా వెళ్ళిపోయాడు.

"ఎంత చెడ్డా వాళ్లూ వాళ్లూ ఒకటి." గణపతి మనస్సు గొణిగింది.

గదిలో వచ్చి కూర్చున్నాడు. మాధవయ్యగారి ప్రవర్తన వింతగా మారిందనిపించింది. ఒక విధంగా తనను ఊళ్లో కొందరి దృష్టిలో చెడ్డవాణ్ణిగా మార్చి, శత్రువును చేసింది ఆయన. 'నా మూలంగా మీకు జరిగే అన్యాయం నాకు జరుగుతున్నట్లే' అన్న మాధవయ్యగారే యీనాడిలా మాట్లాడటంతో గణపతికి కోపం కలిగింది.

పరిస్థితులు విషనాగులై కోరలుసాచి బుస కొడుతున్న సమయంలో మనిషికి తోడు ముఖ్యం. అది కరువైనప్పుడు ఎంతటి ధైర్యస్థుడైనా బెంబేలు పడక మానడు. గణపతి స్థితి అలాగే అయింది.

అతని హృదయంలో తీవ్రమైన భావ సంఘర్షణ బయలు దేరింది. ఉనికి—పరిసరాలు—పరిస్థితుల పూర్వాపరా లాలోచించుకున్నాడు. కొద్ది సేపటికి ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా కుర్చీలోనుంచి లేచాడు.

*　　*　　*　　*

గణపతి రాక చిరంజీవికి మహదాశ్చర్యాన్నే కలిగించింది.

"అయితే ఓడిపోయి పారిపోయి వచ్చావన్నమాట. మొత్తానికి ఖడ్గతిక్కన సంతతి వాడినని ఋజువు చేసుకున్నావ్" అన్నాడు.

పొడిగా నవ్వేసి అన్నాడు గణపతి. "తా నొకటి తలిస్తే భగవంతు డొకటి చేస్తుంటే మానవుడు ఓడిపోతాడు. చచ్చిపోతాడు."

చిరంజీవికూడా నవ్వొచ్చింది. "అందుకే అంత పెద్ద పెద్ద తలపులు యీ చిన్న తలలకు ఒద్దురా అన్నాను నేను. వింటేగా. అదేమంటే ఏ ప్రయత్నమూ, ఏ ఆశయమూ, లేక జీవచ్ఛవంలా బ్రతకమంటావా? అని ప్రశ్న వేస్తావు. ప్రవాహ వేగానికి ఎదురీదగలమా?"

గణపతి చిరంజీవి మాటల్ని విని అతనివైపు పరీక్షగా చూశాడు. ఒక్క క్షణం ఆగి అన్నాడు. "మన యిద్దరి భావాలూ ఎదురెదురు దిశల్లో పయనిస్తూ ఉన్నాయిరా. అవి ఎప్పుడో కలుసుకుంటాయి తప్ప స్థిరంగా కలిసి ఉండలేవు. ఏం చేస్తాం. ఎవరి బాధ వాళ్ళనుభవిద్దాం."

చిరంజీవి ఫెళ్ళున నవ్వాడు. గణపతి కాస్త కంగారు పడ్డాడు.

నవ్వును ఆపుకుంటూ అన్నాడు చిరంజీవి. "బలే వేదాంతం చెప్పావురా గణపతీ" అని అంతలోనే విషయం మారుస్తూ "ఇహ నీ ప్రస్తుత కర్తవ్యం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

గణపతి మాట్లాడలేదు.

"చెప్తినిగా. ఆ ఆటోమొబైల్ కంపెనీలో నాకు తెలిసిన ఫ్రెండ్ తండ్రి ఉన్నాడు. ఆయన దగ్గిటికి పోయి మాట్లాడదాం. బడిపంతులు ఉద్యోగం దొరకాలంటే ఇప్పుడేం లాభం లేదు గదా? ఏమంటావ్."

"నీ ఇష్టం" అన్నాడు గణపతి.

ఇద్దరూ కలిసి ఆ కంపెనీకి పోయి మాట్లాడేరు.

గణపతికి ఉద్యోగం కుదిరింది.

* * * *

మణి మస్తుగా ముస్తాబైంది.

లైట్ గ్రీన్ షిఫాన్ చీరమీద అదేరంగు స్లీవ్‌లెస్ టెర్లిన్ చోళీ వేసుకుంది. చీరలోనుండీ శాటీన్ పావడా, చోళీలోనుండీ బాడీ తొంగిచూస్తుంటే, ఆమె అవయవాల బింకం పొంగులెత్తి అందపు అంచుల్ని తాకుతున్నది. మెడ మీద జెర్రిపోతులా వ్రేలాడుతున్న జడలో మల్లెదండ ముడిచి నిలువుటద్దంలో తన్ను తాను చూసుకుంది. విలాసంగా తల వంచి ఒకటికి పదిసార్లు ఆపాదమస్తకం పరీక్షగా

చూసుకున్న మణి మొహంమీద గర్వరేఖలు పరచుకున్నై. తన అందానికి తనే మురిసిపోయి, కులుక్కుంటూ వాకిట్లో కొచ్చింది.

అప్పుడే ఫస్టు షో వదలటంతో రోడ్డు జనంతో రద్దీగా ఉంది.

ప్రక్కనున్న 'టీ' కొట్టు రత్తయ్య గ్లాసులో చెంచా వేసి 'గరం గరం చా' అంటూ గణ గణలాడిస్తున్నాడు.

మణి ఓమారు నాలుగువైపులా పరికించి చూసింది. ఆమె దృష్టి రోడ్డుకు అవతలివైపున ఫుట్ పాత్ మీద నిలబడి తదేకంగా తనవైపే చూస్తున్న ఓ యువకునిమీద నిలిచింది.

ఇంతలో ఆమె ముందుగా ఒక రిక్షా వచ్చి ఆగింది.

"ఓహో" అనే స్వరంలో యీలవేసి రిక్షావాడు "వస్తావా" అని అడిగేడు.

మణి ఛిరాగ్గా సమాధానం చెప్పింది, "నీ బేరమూ, నువ్వూ... సరి... సరి... పో."

"ఆఁ... ఆఁ..." అని ఏదో సణుక్కుంటూ సాగి పోయాడు రిక్షావాడు.

మణి చూపులు ఆతృతగా రోడ్డు అవతలివైపుకు మరలినై... కాని... ఇందాకటి యువకుడు అక్కడ లేడు... అతనికోసం పరిసరాల్ని పరికించింది మణి. అతను ఆమె ఇంటికి నాలుగుగజాల దూరంలో నిలబడి, కుడిచేతి నాలుగు

వేళ్ళు ముడిచి, చూపుడు వ్రేలుతో కణతలుకొట్టుకుంటూ ఏదో ఆలోచిస్తున్నాడు.

మణి కన్నార్పకుండా అతన్ని చూస్తూఉంది. అతను ఆమెవైపు చూస్తున్నాడు.

మణి తల ప్రక్కకువంచి కన్ను గీటింది. జారిన పైటను రెండు చేతుల్తో క్రిందకు తీసుకుని సరిచేసి విసురుగా వెనక్కు వేసుకుంది.

కొద్ది క్షణాలు అటూ ఇటూ అనుమానాస్పదంగా చూసి ఆమె దగ్గరికొచ్చాడతను.

మణి లోపలికి దారితీసింది. అతని కాళ్ళు అసంకల్పంగా ఆమె ననుసరించినై.

మణి అతన్ని "కూర్చోండి" అని కుర్చీ చూపుతూ తలుపు వేసి వచ్చింది. అతను కూర్చున్నాడు.

అతనా ఇంటి నలుమూలలా చూడసాగేడు. ఒక పెద్ద పందిరిమంచం, దాని ప్రక్కనే తను కూర్చున్న పడకుర్చీ, మంచానికి వెనుకగా ఓ పెద్ద నిలువుటద్దం, దాని ప్రక్కనున్న గూట్లో కొన్ని అలంకరణ సామగ్రి, ఇంటి కప్పునుంచీ వ్రేలాడదీయబడిన దండెంమీద కొన్ని చీరలు, లంగాలు, జాకెట్లు—ఇవి తప్ప ఆ గదిలో చెప్పుకోతగ్గ సామాన్లేమీ లేవు. గదికి ఓ మూల డోర్ కర్టెన్ వ్రేలాడుతున్నది. దాని వెనుక వంటగది కాబోలు అనుకున్నాడు.

మణి గదిలోకొస్తూ "ఎలా ఉంది మా ఇల్లు" అంది, చేతిలోని యిస్త్రీ లుంగీని-అతని కందిస్తూ.

"బాగానే ఉంది" అని "అక్కర్లేదు" అన్నాడతను.

మణి ఆశ్చర్యపోయింది.

ఆమెను పరీక్షగా చూశాడతను. ఇప్పుడామె పూర్తి వైట్ డ్రెస్‌లో ఉంది. ఆమె అతనికి దగ్గరగా వచ్చి పడక్కుర్చీపైన చేతు లానించి, అతని మీదికి వంగింది.

ఆమె సౌందర్యాన్ని కండ్లతోనే తనివితీర గ్రోలి అన్నాడతను, "ఇంతటి జగదేక సౌందర్యాన్ని బజారు పాలుచేసి, అందానికి తలవంపులు తెస్తున్నావ్."

మణి దెబ్బతిన్న లేడిలా అయింది. లేచి వెనక్కు నిలబడింది. ఆమె కళ్లు నీళ్ళు తిరిగినై.

అతను లేచి ఆమె దగ్గరగా వచ్చాడు. ఆమె భుజం మీద చెయి వేసి "నీ పేరు?" అన్నాడు.

"మణి"

"చూశావా మరి. మణి యిలాంటి మురికి కూపంలో ఉంటే ప్రకాశించదు. ఇరవై యేళ్ళన్నా నిండని నువ్వీ పాడు వృత్తిలో కెలా దిగావసలు?" అనునయంగా అడిగేడు.

ఆమె జవాబు చెప్పలేదు. ఆ విషయాలన్నీ నీ కెందుకన్నట్లుగా చూసింది.

అతను మళ్ళీ అడిగాడు.

"ప్రపంచంలో దుర్వ్యసనాలకు లోనయ్యే ప్రతి వ్యక్తి వెనుకా ఏదో జాలి గాథ దాగిఉంటుందనీ, ఏదో బలవత్తర

మైన కారణాలవల్ల, పరిస్థితుల ప్రోద్బలంవల్ల వ్యసనాలకు లోనవటం జరుగుతుందనే సిద్ధాంతవాది అతను.

ఆమె చెప్పింది. "మా అమ్మ ఒక బిచ్చగత్తెట. చచ్చిపోతూ నన్ను ఓ ముసలావిడ కిచ్చి పోయిందిట. ఆవిడే నాకు చదువు, నాట్యం నేర్పించి ఆ విద్యల్తోపాటు యీ విద్యా నేర్పింది. ఆవిడా నిరుడే పోయింది. పొట్ట కూటికి మరో మార్గం లేక నేర్చిన విద్యను ఉపయోగించుకుంటున్నా."

"ఎంతవరకు చదివేవు?"

"థర్డు ఫారం."

అతను కొద్దిక్షణాలుఆగి మంచంమీద కూర్చుంటూ అన్నాడు. "మణీ, నీవంటి సౌందర్యరాశి, అంతో యింతో చదువు ఉన్న స్త్రీ యిలాంటి పనికి పూనుకున్నదంటే నా కెంతో బాధగా ఉంది. జీవితంలో ఏ మాధుర్యమూ చవిచూడని నువ్వు యీ వలయంలో పరిభ్రమిస్తూ పచ్చని జీవితాన్ని బీడుగా మార్చుకోవటం—హుఁ... ఈ విషయాలన్నీ ఎందుకు— నే వచ్చిన పని చెప్తాను. నాకు వెనకా ముందూ ఎవరూ లేరు. ఈ ఊళ్లో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. నెలకో వందరూపాయలో స్తయ్. పెళ్ళి చేసుకోవాలనే కోర్కెతోపాటు నీవంటి యువతిని చేసుకోవాలనే ఆశయం కలిగింది నాకు. నెలరోజుల్నుంచీ ప్రయత్నంలో ఉన్నాను. ఇవ్వాళ నువ్వు తటస్థపడ్డావు. నా ఎన్నిక సరయినదేనని తోస్తున్నది... నీ కభ్యం

తరం లేకుంటే ..." ఆపి ఆమెను సూటిగా చూస్తూ అన్నాడు. "నిన్ను నా దానిగా చేసుకుంటాను."

మణి పొడిగా నవ్వింది. ఆ నవ్వులో ఏ భావమూ లేదు. జీవం లేదు. కొద్ది క్షణాలు ఆలోచించి "సరే... నేనూ ఆలోచించుకుని ఓ నిర్ణయానికి వస్తాను. నాకు కొంత వ్యవధి యివ్వండి" అంది.

అతను సంతృప్తిగా ఊపిరి పీల్చుకుని "అలాగే... నీ యిష్టమొచ్చినంత టైమ్ తీసుకో." అంటూ లేచాడు.

మణి "అఁహాఁ..." అంటూ దగ్గరికొచ్చి "మరి..." అని అర్థోక్తిలో ఆపింది...

"ఒక నిశ్చయానికి వచ్చిన తర్వాత..." నవ్వుతూ బయటికి వచ్చా డతను. గడప వరకూ సాగనంపింది మణి.

ఇంతలో ఏదో మర్చిపోయినదానిలా అతన్ని పిలిచింది. "ఏవండీ."

అతను వెనుతిరిగి చూసేడు.

"మీ పేరు ?" ఆమె ప్రశ్నించింది.

"గణపతి..." అంటూ సాగిపోయా డతను !—

*          *          *

గణపతి ఇంటికి చేరుకొనేసరికి పన్నెండు కావచ్చింది.

రూమ్‌లో లైట్ వెలుగుతూ ఉండటం గమనించి ఆశ్చర్యపోయాడు గణపతి. చిరంజీవికి తొమ్మిదిన్నరకల్లా పంక్చువల్‌గా నిద్రపోవటం అలవాటు. గదిలోకొచ్చి మడతమంచం వాల్చుకుని పడుకున్నాడు గణపతి.

అతని చర్యల నన్నింటినీ పరిశీలిస్తూ అప్పటివరకూ ముభావంగా కూర్చున్న చిరంజీవి, గణపతి పడుకోగానే మొదలెట్టాడు. "నీ ప్రవర్తన నాకేం నచ్చటంలేదురా గణపతీ..."

గణపతి విస్తుపోయాడు.

"అవును. నెలరోజుల్నుంచీ చూస్తూనే ఉన్నాను. అర్ధరాత్రీ, అపరాత్రీ వచ్చి పడుకోవటం, మాటా మంతీ లేకుండా తిరగటం, అన్నీ గమనిస్తూనే ఉన్నాను. ఇవ్వాళ నువ్వు చేసినపని ...ఛా... నీలాంటివాడలా తిరుగుతున్నాడన్నా నమ్మ శక్యంగాదు. అలాంటిది నా కళ్ళతో చూసే దౌర్భాగ్యం పట్టింది నాకు ... ఛీ ... యింత బ్రతుకూ బ్రతికి..."

"చిరంజీవీ" గణపతి ఆవేశంగా అరిచాడు. నేనేం అంత చెడ్డపని చెయ్యలేదు ... అనవసరంగా మాట జారవద్దు."

చిరంజీవి నిశ్చేష్టుడై పోయాడు.

గణపతి అన్నాడు మళ్ళీ, "పైగా నీకు నా ఉద్దేశాన్ని ఏనాడో చెప్పాను. ఇందులో తప్పేమీ లేదు. నే నేమీ పరువు తక్కువ పనులు చెయ్యటంలేదు."

చిరంజీవి కోపంగా అన్నాడు. "ఆదర్శం పేరుతో నీ చిత్తమొచ్చిన పనులు చేస్తానంటే నేను సహించలేను గణపతీ. నా కెంత జీవిత లక్ష్యాలు తెలియకపోయినా నువ్వు యివాళ చేసిన పనిని గాని, రేపు చేయబోయే పనిని గాని హర్షించలేను."

"ఇతరులు హర్షించరనీ, ఏదో అయిపోతారనీ నేను నా ప్రయత్నాన్ని వదులుకోలేను..."

"నేను అలాంటి మనుష్యుల్నే వదులుకోగలను..."

"చిరంజీవీ..." గణపతి నివ్వెరపోయి అన్నాడు.

"తల వంచుకుని చెప్పాడు చిరంజీవి. "నువ్వు నీ ప్రయత్నాన్ని విరమించుకోలేకపోతే మనకు పొత్తు కుదరదు. పండువంటి మన మైత్రిని కుళ్లబెట్టి నడిబజార్లో విసిరేసే వరకూ నేనూ చేతులు ముడుచుకు కూర్చోలేను..."

"అయితే సరే ... యింత దూరం వచ్చిన తర్వాత యింకెందుకు... రేపు మాపుల్లో జరిగేపని యీరోజే జరిగి పోవటం మంచిది. నే నిప్పుడే వెళ్ళిపోతాను..." గణపతి విసురుగా మంచం దిగాడు.

చిరంజీవి ఆశ్చర్యంగా అన్నాడు, "ఇప్పుడా... ?"

"అవును యిప్పుడే..."

"ఎక్కడికి... ?"

"ఎక్కడి కేమిటి. లోకంలో నీ అంత ఉదారులు ఇంకెంతోమంది ఉన్నారు..."

చిరంజీవి బాధపడ్డాడు. గణపతి వెళ్ళిపోవటానికి సిద్ధపడుతూంటే అతని మనస్సు తహతహ లాడసాగింది. "గణపతీ..." అన్నాడు బొంగురుపోయిన కంఠంతో. అతని కళ్ళు అశ్రుపూరితా లైనాయి.

"గణపతీ...నామాట విని నీ ప్రయత్నం మానుకో. కావాలంటే మంచి సంబంధం చూసి నీకు పెళ్ళిచేసే బాధ్యత నాది."

"వీల్లేదు చిరంజీవి... ఇతరులకోసం నేను నా ఆశయాన్ని వదులుకోలేను."

"అయితే నన్నే వదులుకుంటావా?" చిరంజీవికి దుఃఖం కట్టలు తెంచుకుంది.

"ఆఁ..." మొండిగా అనేశాడు గణపతి.

గణపతి మొండిపట్టుకు వగవటం కన్నా మరేమీ చేయలేకపోయాడు చిరంజీవి.

మరో గంటకు—చీకటీ—చిరంజీవీ మిగిలారా గదిలో!

*      *      *      *

అగ్నిసాక్షిగా జరుగవలసిన గణపతి పెళ్ళి రిజిస్ట్రారు సాక్షిగా జరిగిపోయింది.

ఆ ఆఫీసులో పనిచేసే గుమాస్తాలే పెళ్ళి పెద్దలై దంపతుల్ని దీవించారు.

పవిత్ర మాంగల్యబంధం మరోరూపు దాల్చి పూలదండగా మారింది.

మంత్రాలు దస్తావేజుగా రూపొందాయి.

గణపతి ఒక యింటి వాడైనాడు.

చిరంజీవిని ధిక్కరించి మాటమీద మాటఅని వచ్చేసినందుకు గణపతికి బాధగానే వుంది. కాని ఈ బాధనుమించిన తీయని బాధల్లో దాన్ని మర్చిపోగలిగాడు.

మణి అతనికి మధుర రసాలను చవి చూపుతూ, అతన్ని నందనవనాల్లో విహరింపచేయసాగింది. అతనిభావనా

స్వర్గానికి రూపాన్నిచ్చి, అతని ఆశయ సాధనను పట్టు కొమ్మయి—మణి గణపతికి ఆరాధ్యదైవంగా మారింది. ఆమె సన్నిధిలో అతనొక పసివాడై క్రీడించసాగేడు. ఆ ఆట పాటల్లో రోజులు క్షణాలుగా దొర్లిపోతున్నై.

ఆ వేళ...

సరసాల మురిపాల తూగుటుయ్యాలలో తేలిపోతున్న గణపతి ఆనందమయ కేళికి అంతరాయాన్ని కలిగిస్తూ కవ రొకటి యిచ్చిపోయాడు పోస్టుమన్.

చదవమని కవర్ని మణికిచ్చాడు గణపతి. ఆమె ఉత్తరం తీసి చదవసాగింది.

"ప్రియమైన మేష్టరుగారికి—

"ఓ ... మా సుజాతా ... ఏదీ... యిలాతే ..." అంటూ హుషారుగా లేచి మణి చేతిలో ఉత్తరం లాక్కుని గబగబ చదవసాగేడు.

తాను చదవబోయే ఉత్తరాన్ని గణపతి లాక్కుని చదవ సాగటంతో మణికి కోప మొచ్చింది.

జాబు చదువుతున్నకొద్దీ అతని కవళికలు మారి, మొహం విషణ్ణమైంది. నిరుత్సాహంతో మంచంమీద కూల బడిపోయాడు.

అతని మనస్సు కలతచెందింది. సుజాతను గురించిన ఆలోచనలు ముసురుకోసాగినై. ఆమె వ్రాసిన విషయాల వెనుక దాగిన ఘోరాలు అతనికళ్ళముందు నర్తించసాగినై.

కొండంతను గోరింతలుగా చెప్పినా, దాని యథార్థ పరిణామాన్ని ఊహించుకోగలిగినవాళ్లు కొందరుంటారు. గణపతి తత్వం అంతే. ఎదుటివారికి ఏమాత్రం కష్టంకలిగినా దాని లోతును గమనించటం అలవడిందతనికి. ఇప్పుడు సుజాత కూడా చెప్పీ చెప్పనట్లు కొన్ని బాధల్ని వెలువరించింది. ఆమె వ్రాత వెనుక దాగిన ప్రత్యక్షకథనాలు ఆమెకే తెలుసు. కాని, 'అవి యిలాఉండి ఉంటాయి' అని చెప్తున్నది తన మనస్సు.

ఉత్తరాన్ని మళ్ళీ చదువుకున్నాడు గణపతి.

"ప్రియమైన మేష్టరుగారికి—

"నమస్కారములు. నాన్నకు గారాబు పట్టిగా పుట్టి పెరిగిన నేను, మరొకరి దాసిగా యిక్కడకు వచ్చిన చాల రోజులకు మీకు ఉత్తరం వ్రాస్తున్నాను. ఈ ఆలస్యానికి కారణం మీ అడ్రస్ దొరక్కపోవడమే... మొన్న గోపాలం యిక్కడికి వచ్చినప్పుడు చెప్పాడు, మీరాఊళ్ళో ఉద్యోగం చేస్తున్నారని.

"ఆ రోజున మీరు మూగ కళ్ళతో నాకు వీడ్కోలు చెప్తున్నప్పుడు, పెళ్ళికూతురుగా మారిన నేను కళ్ళు ఒప్ప జెప్పి చూడటం కన్నా మరేమీ చేయలేకపోయాను. ఉదర పోషణకోసం మా ఊరికి వచ్చి, నలుగురికి ఉపకారం చేయాలనే సదాశయానికి ప్రతిఫలంగా అపకారాన్ని పొందిన మిమ్మల్ని తలచుకుని నేనెంతగానో బాధపడ్డాను. పోనీలెండి. ఏదెలా ఉన్నా మీరా విషవలయంలోనుంచి త్వరలో బైట

పడినందుకు 'కీడులో మేల'నిపించింది నాకుమాత్రం. సరే... గతించినదాన్ని పునరావృతిచేసి మీ మనసుకు కష్టం కలిగించటమెందుకు?—

ఇక నా సంగతి. మీకు తెలుసుగా మాష్టారూ... నాదంతా లక్క స్వభావమని. వేడిచేస్తే ఉక్కిరిబిక్కిరై చెప్పినట్లు వంగుతుంది. మా మామగారు ఈ ఊళ్లోకల్లా పెద్ద రైతు. రోజూ పది పదిహేనుమంది దాకా రాజకీయ వేత్తలు వీరికోసం వస్తూ పోతూ ఉంటారు. మా నాన్న కూడా వాళ్ళల్లో ఒకడైనాడు. వచ్చే యేడు 'ఎమ్.ఎల్.ఏ' పదవి ఆయనదే నట నిర్ణయమైందట. ఆ సంగతి నాకు చెప్పి "ఇదంతా నీ అదృష్టం తల్లీ" అంటూ మురిసిపోయాడు.

మా అత్తగారు చాలా మంచిది. కొడుకంటే ఆవిడకు పంచప్రాణాలు. వారికి కావలసిన సకలావసరాలు ఆమె స్వయంగా తీరుస్తుంది. తల్లిని పిల్లిలా ఆడించి కావలసింది ఒడుక్కుపోగల నేర్పు మావారికిఉందిలెండి వారు ఉద్యోగం ఏమీ చేయుటం లేదు. కాని ఉద్యోగస్థులకుండే కనీసపు తీరిక కూడా వారి కుండదు. దానికి ముఖ్యకారణం వారివ్యాపకాలే. ఇంట్లో భార్యకన్నా కర్తవ్య నిర్వహణ ముఖ్యం గదా మాష్టారూ?... అందుకే వారు నాకన్నా, నా సౌఖ్యంకన్నా కూడా తమ 'విధి కి ప్రత్యేక ప్రాముఖ్యాన్నిస్తారు. దాని తర్వాతే మిగిలిన విషయాలు. ఆ విధి నిర్వహణలో ఎంత 'సొమ్ము' పోయినా బాధపడరు.

"అదీ నా పరిస్థితి. ఇలాంటి సుఖాన్నీ, ఆనందాన్నీ అనుభవించి విసుగుపుడుతున్నది... మాస్టారూ?...

"అందుకే మా అత్తగారు అంటూ ఉంటారు. "నీకు వేదాంతం తలకెక్కుతున్నదే కోడలా" అని.

"అవును మరి. అన్ని ఆనందాలకు చరమావస్థ అదే గదా... నిజమేనా మేస్టారూ ...ఏమిటో లెండి. పోరుఘారం తెలివంతా ఉపయోగిస్తున్నదే సుజాత అనుకుంటున్నారా? అనుకోండి... నాకేం ఫర్వాలేదు...

"గోపాలం మొన్నీమధ్య యిక్కడికి కొచ్చినప్పుడు భయపడుతూ అన్నాడు. "అమ్మాయిగారూ... మిమ్మల్ని మాస్తుంటే నాకేదో భయంగా ఉందండి..." అంటూ.

"పిచ్చివాడు! కాక మరేమిటి? ఆనందంతో త్రుల్లిపడుతున్న నన్ను చూస్తే భయమేమిటి?— అదే చెప్పి పంపాను, "నాకీ సంసార సౌఖ్యంమీద యింకా పూర్తిగా విరక్తి పుట్టలేదు లేవయ్యా గోపాలం... అంత భయపడకు" అని.

"అది సరే మేస్టారూ... అన్నట్టు పెళ్ళి విందెప్పుడు చేస్తారు మా కందరికీ... ఆ సంతోషాన్ని నాకిస్తారో— లేక ఆ... ఎక్కడి సుజాత, అని వదిలేస్తారో?—

"ఉంటాను మాస్టారూ......ఇప్పటికే మీకు తలనొప్పి పుట్టించి ఉంటుంది నారాత... సెలవు—

సుజాత...

కంఠంలో మ్రింగుడుపడని గరళాన్ని దాచుకున్న ఈశ్వరుడి నెత్తినే ఉన్నాడు, చల్లని వెన్నెలలు కురిపించే చంద్రుడు.

బడబాగ్నులతో హృదయాన్ని దహింపజేసుకుంటూ చిరునవ్వు చిలకరించగలిగే శక్తి అందరికీ వుండదు.

తెలిపీ, తెలపనట్టు తన స్థితిని వివరించిన సుజాత తెలివితేటలకు ఆశ్చర్యపోయాడు గణపతి... "అవును. సంస్కారం, జ్ఞానం కేవలం చదువువల్ల కలిగేవి కావు." అనుకున్నాడు.

"ఎవరండీ ఈమె?"

గణపతి ఆలోచనల్ని ఆపి మణిని చూశాడు.

ఆమె ఉత్తరాన్ని చదివినట్లుంది. మడిచి కవర్లో పెడుతూ అడిగింది.

మణి ప్రశ్నలో ఈర్ష్యాసూయలు ధ్వనించినై గణపతికి. తీక్షణంగా ఆమెను చూస్తూ అన్నాడు, "నా కాప్తురాలు" అని.

"ఆఁహాఁ... అది తెలుస్తూనే ఉంది." అని మూతి విరిచి అక్కణ్ణుంచి లేచి వెళ్ళింది మణి.

'అసూయకు పర్యాయపదం—స్త్రీ' అనిపించింది గణపతికి. సన్నగా నవ్వుకుని భార్యను పిలిచాడు. మణి పలక్కుండా వంటగదిలో చాప పఱుచుకుని పడుకుంది.

గణపతి ఆలోచన జాబులోని విషయాల మీదికి పోయింది. 'తనను చూసి అత్తగారు వేదాంతం తలకెక్కుతున్నదనీ—గోపాలం తనకేదో భయంగా ఉందనీ, అన్నాడని వ్రాసింది సుజాత... అంటే?—ప్రశ్నార్థకం వెక్కిరించింది గణపతిని... మరో విషయం, "ఈ సంసార సౌఖ్యం

మీద పూర్తిగా విరక్తి పుట్టలేదు.' అని వ్రాయటంలో సుజాత ఆంతర్యం ఏమిటి?—పూర్తిగా విరక్తి పుడితే?—

గణపతిలో హృదయచలనం అధికమైంది. మనస్సంతా అల్లకల్లోలమైంది. సుజాత ఏ అఘాయిత్యానికన్నా తలపడుతుందా?—అతని కేదో భీతి కలిగింది. సుజాతమీద అతనికున్న అభిమానం, ఆప్యాయతా పొంగి, ఆమెను గురించి చెడుగా ఆలోచించుకునేసరికి దుఃఖం ముంచుకొచ్చింది. ఆమె అంటే అవ్యక్తమైన అనురాగం నిండిన అతని మనస్సుకు, సోదరీ ప్రేమను చవిచూపిన సుజాతకు ఈ కష్టా లేమిటని వ్యథ చెందింది గణపతి హృదయం.

'వ్యధిత హృదయాలకు శాంతి నిచ్చే శక్తి ఒక్క నిద్రాదేవతకే ఉంది...'

* * *

నెలరోజుల తర్వాత ఒకరోజు—

సాయంత్రం ఆరుగంట లైంది—

గణపతి ఆఫీసునుంచి కాళ్ళీడ్చుకుంటూ యింటిదారి పట్టాడు.

వ్యాపారం నష్టంలో నడుస్తున్నదని ఉద్యోగాన్నుంచీ తీసేసి, ఆనాటి వరకూ అతనికి రావలసిన జీతం ఇచ్చి పంపారు కంపెనీవాళ్ళు. భవిష్యత్తు కష్టాల మయంగా గోచరించి, నిస్పృహ కలిగించింది గణపతికి.

'టీచర్ ఉద్యోగం వదిలేసి వచ్చినా చిరంజీవి సహాయంతో వెంటనే యీ ఉద్యోగం దొరికింది తనకు. ఇప్పు

డిదీ పోయింది. చిరంజీవి లేడు — రేపనేది ఎలా గడుస్తుందో ననే దిగులుతో, మరో ఉద్యోగం ఎలా దొరుకుతుందనే బెంగతో నిండిపోయింది గణపతి హృదయం.

అనేక రకాలయిన ఆందోళనలతో యిల్లు చేరాడు. ఎదురుగా తాళం అతన్ని చూసి వెక్కిరించింది.

ఇంతలో ప్రక్కింటిపిల్లవాడు తాళంచెవి తెచ్చిచ్చాడు "మణమ్మగారు యిమ్మన్నారు, ఎటో వెళ్ళా" రంటూ.

"సరి... ఈవిడ కెప్పుడూ ఏదో ఓ షాపింగు" అను కుంటూ విసుగ్గా లోపలికి వెళ్ళి పడకుర్చీలో కూర్చో బోయాడు. అందులో ఉత్తరం... తీసి గబగబా చదివాడు.

"శ్రీవారికి...

"నేను పతితను ... ప్రపంచానికి తెలిసిన యథార్థ మిది. అయినా కోరి, నాకోసం పరితపించి నన్ను పెళ్ళిచేసు కున్నారు. నాకోసం గొప్ప త్యాగంచేసి ఆదర్శంగా నిలిచారు... కానీ...

"మీరూ నాలాగే పూర్వ చరిత్ర ఉన్నవారని తెలి సిన తర్వాత నాలో ఉన్న అసూయ కానీండి, బలహీనత కానీండి బయటపడింది. నాకీ జీవితంకన్నా గత జీవితమే హాయీ, మేలనిపించింది. ఆలోచించి, ఆలోచించి యీ నిశ్చయాని కొచ్చాను... అందుకనే మీనుంచి తప్పుకుంటు న్నాను. నన్నొక నీచురాలిగా తలచి మరచిపొండి...

"మీ పూర్వ ప్రేయసి కాబోలు మళ్ళీ ఉత్తరం వ్రాసింది. టేబుల్ మీద ఉంది...

మీ మణి...

"మణి! ..." గణపతి కుప్పలా కూలిపోయాడు. ఏదో విషవాగురంలో తగుల్కొని తల్లడిల్లేవాడిలా అయిపోయాడు... కోటికంఠాలేకమై వికటాట్టహాసాలు చేస్తూ అతని కళ్ళముందు నర్తించినై. అసంకల్పంగా టేబులుమీద కవరును తీశాయి చేతులు... ఉత్తరాన్ని చించి పుచ్చుకున్నాయి... కళ్ళు అక్షరాల్ని చూశాయి... మనస్సు చదువుకుంది...

"పంతులుగారూ... సుజాతమ్మగారు వాళ్ళ ఊరి పక్క ఏటిలో పడి చచ్చిపోయారు... గోపాలం..."

"సుజీ..." గణపతి తల పడక్కుర్చీ ఫ్రేముకు కొట్టుకుని దిమ్మెక్కిపోయింది. గణపతి పిచ్చివాడే అయాడు.

విధి చేతి కీలుబొమ్మ నట్టొకటి రాలిపోయింది.

ప్రపంచంలో వెలుగు నిండుకుంది—

జగతి చీకటిని నింపుకుంది—

ప్రకృతి పురుషుల వింత వింత సల్లాపాల్ని విని గంభీరంగా అపహసించాడు సాగరుడు—